

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | బుధవారం 24-12-2025 | సంపుటి - 26 | సంచిక -216 | రూ : 4 | పేజీలు: 8


## ఢిల్లీలో బంగ్లాదేశ్
# హైకమిషన్ ఎదుట ఉద్రిక్తత

- దీపు చంద్ర దాస్ హత్యపై ఢిల్లీలో భారీ నిరసనలు
- ఢిల్లీలోని బంగ్లా హైకమిషన్ ఎదుట కట్టుదిట్టమైన భద్రత
- బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులపై ఆగ్రహం
- భారత్‌లో దౌత్య కార్యాలయాల భద్రతపై బంగ్లాదేశ్ ఆందోళన

2లో





2లో

### శ్రీహరికోటలో బ్లూబర్డ్ బ్లాక్2
## మిషన్ కౌంట్‌డౌన్ ప్రారంభం

- అమెరికా కమ్యూనికేషన్ ఉపగ్రహం బ్లూబర్డ్-6ను మోసుకెళ్లనున్న ఎల్‌వీఎం3-ఎం6
- శ్రీహరికోటలో 24 గంటల కౌంట్‌డౌన్ ప్రారంభం
- రేపు ఉదయం 8.54 గంటలకు నింగిలోకి ఎగరనున్న రాకెట్

## చైనా, పాకిస్థాన్‌తో వివాదాలు..
### యుద్ధాలకు సిద్ధంగా ఉండాలని సీడీఎస్ అనిల్ చౌహాన్ కీలక వ్యాఖ్యలు

- ఉగ్రవాదం, సరిహద్దు వివాదాలు సవాళ్లుగా ఉన్నాయన్న అనిల్ చౌహాన్
- ఇద్దరు ప్రత్యర్థులు అణుసామర్థ్యం కలిగి ఉన్నారన్న సీడీఎస్
- ఎలాంటి సవాలునైనా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలని వ్యాఖ్య

2లో





2లో

## మావోయిస్టులకు మరో భారీ ఎదురుదెబ్బ

- ఏవోబీ సరిహద్దులో లొంగిపోయిన 22 మంది మావోలు
- లొంగిపోయిన వారిలో ఆరుగురు డివిజనల్ కమిటీ సభ్యులు
- లొంగిపోయిన మావోయిస్టులపై రూ.2.18 కోట్ల రివార్డు



2లో

## సుప్రీంకోర్టులో ఏఎస్‌జీగా కనకమేడల
### కేంద్ర ప్రభుత్వంలో టీడీపీ నేతకు కీలక పదవి

## అసెంబ్లీకి రాని కేసీఆర్ మీడియా సమావేశంలో ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారు



2లో

- ప్రజా ప్రభుత్వంపై బీఆర్ఎస్ నాయకులు విషం కక్కుతున్నారని ఆగ్రహం
- ప్రతి పైసా ప్రజల కోసమే ఖర్చు పెడుతున్నామన్న ఉపముఖ్యమంత్రి
- కేసీఆర్ అసెంబ్లీకి రావడానికి భయపడుతున్నాడని వ్యాఖ్య




## సౌత్ ఇండియా రాకెట్రీ ఛాలెంజ్
# 2K26 పోస్టర్ ఆవిష్కరించిన సీఎం

- విద్యార్థుల కోసం ఏపీ సర్కార్ సౌత్ ఇండియా రాకెట్రీ ఛాలెంజ్
- గుంటూరు విజ్ఞాన్ యూనివర్సిటీలో జనవరి 22 నుంచి ఫైనల్స్
- పాఠశాల, కళాశాల విద్యార్థులకు రెండు విభాగాల్లో పోటీలు
- రిజిస్ట్రేషన్ల కోసం ప్రత్యేక వెబ్‌సైట్ ఏర్పాటు

2లో

# ఏసీబీ సోదాలు.. మహబూబ్‌నగర్ డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ వద్ద రూ.36 కోట్ల ఆస్తుల గుర్తింపు

మహబూబ్ నగర్: మహబూబ్‌నగర్ డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ కిషన్ నాయక్ ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారన్న ఆరోపణలపై ఏసీబీ అధికారులు ఆయన నివాసంలో సోదాలు నిర్వహించారు. ఈ రోజు ఉదయం నుంచి హైదరాబాద్ బోయినపల్లిలోని ఆర్‌ఆర్ నగర్‌లోని ఆయన నివాసంతో పాటు దాదాపు 12 ప్రాంతాల్లో అధికారులు సోదాలు




నిర్వహించి పెద్ద మొత్తంలో ఆస్తులను గుర్తించారు. గుర్తించిన ఆస్తుల విలువ బహిరంగ మార్కెట్‌లో రూ.36 కోట్లకు పైగా ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. వివిధ ప్రాంతాల్లో పెట్రోల్ బంకులు, షాపింగ్ కాంప్లెక్సులు, హోటళ్లు, స్థిర, చరాస్తులను గుర్తించారు. బ్యాంకు లాకర్లలో కిలోన్నర బంగారాన్ని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఏసీబీ అధికారులు హైదరాబాద్, మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాలతో పాటు వివిధ ప్రాంతాల్లో సోదాలు నిర్వహించారు. కిషన్ నాయక్ 2024 డిసెంబర్‌లో మహబూబ్ నగర్ డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టారు. ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీఏ కార్యాలయాలపై అవినీతి ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో ఏసీబీ సోదాలు నిర్వహిస్తోంది.

## మావోయిస్టులకు మరో భారీ ఎదురుదెబ్బ

ఒడిశా: ఆంధ్ర-ఒడిశా సరిహద్దు (ఏఓబీ) ప్రాంతంలో మావోయిస్టు పార్టీకి మరో భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఒడిశా మల్కాన్‌గిరి జిల్లాలో 22 మంది మావోయిస్టులు లొంగిపోయారు. లొంగిపోయిన వారిలో ఆరుగురు డివిజనల్ కమిటీ సభ్యులు, ఆరుగురు ఏరియా కమిటీ సభ్యులు కూడా ఉన్నట్లు అధికారులు తెలిపారు. లొంగిపోయిన మవోయిస్టులు పోలీసులకు ఆయుధాలను అప్పగించారు. వీటిలో ఒక ఏకే47, రెండు ఇన్సాస్ రైఫిళ్లు, ఒక ఎస్‌ఎల్‌ఆర్ రైఫిల్, మూడు 303 రైఫిళ్లు, రెండు సింగిల్ షాట్ రైఫిళ్లు, అలాగే 14 ల్యాండ్‌మైన్‌లు ఉన్నాయి. పోలీసుల వెల్లడించిన వివరాల ప్రకారం, ఈ 22 మంది మావోయిస్టులపై మొత్తం రూ.2.18 కోట్ల రివార్డు ఉంది. తాజా లొంగుబాటు ఏఓబీ ప్రాంతంలో మావోయిస్టు కార్యకలాపాలకు భారీ ఎదురుదెబ్బ అని పోలీసు అధికారులు తెలిపారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా 2026 మార్చి నాటికి దేశంలో నక్సలిజాన్ని పూర్తిగా నిర్మూలిస్తామని ప్రకటించిన నేపథ్యంలో భద్రతా బలగాలు ఆపరేషన్ కగార్, ఆపరేషన్ కర్రెగుట్ట వంటి ప్రత్యేక దాడులను ముమ్మరం చేశాయి. ఈ ఆపరేషన్లలో పలువురు మావోయిస్టులు ఎన్‌కౌంటర్లలో హతం కాగా, పెద్ద సంఖ్యలో మావోలు పోలీసుల ముందు లొంగిపోతున్నారు.

## చైనా, పాకిస్థాన్‌తో వివాదాలు..
## యుద్ధాలకు సిద్ధంగా ఉండాలని సీడీఎస్ అనిల్ చౌహాన్ కీలక వ్యాఖ్యలు

ఢిల్లీ: స్వల్పకాలిక, దీర్ఘకాలిక యుద్ధాలకు భారత్ సంసిద్ధంగా ఉండాలని సీడీఎస్ జనరల్ అనిల్ చౌహాన్ కీలక వ్యాఖ్యలు చేశారు. అణు సామర్థ్యం కలిగిన చైనా, పాకిస్థాన్ నుంచి ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో ఆయన చేసిన ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. ఐఐటీ బాంబేలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ఉగ్రవాదం, సరిహద్దు వివాదాలు సవాళ్లుగా ఉన్నాయని గుర్తు చేశారు. భారత్‌కు ఇద్దరు ప్రత్యర్థులు ఉన్నారని, ఆ రెండు దేశాలు అణ్వాయుధ సామర్థ్యం కలిగి ఉన్నాయని ఆయన తెలిపారు. ఆ దేశాల నుంచి వచ్చే ఎలాంటి సవాలునైనా ఎదుర్కొనేందుకు మనం సిద్ధంగా ఉండాలని అన్నారు. గతంలో నిర్వహించిన ఆపరేషన్ల మాదిరిగానే ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడానికి స్వల్ప, దీర్ఘకాలిక ఘర్షణలకు సిద్ధంగా ఉండాలని సూచించారు. ఇప్పటికే కొనసాగుతున్న సరిహద్దు వివాదాల కారణంగా భూతల ఘర్షణల్లో పోరాడేందుకు సంసిద్ధంగా ఉండాలని పేర్కొన్నారు. అయితే వీటిని నివారించేందుకు అన్ని ప్రయత్నాలు చేయాలని అభిప్రాయపడ్డారు. కృత్రిమ మేధ, క్వాంటమ్ కంప్యూటింగ్, హైపర్ సోనిక్స్, రోబోటిక్స్, ఎడ్జ్ కంప్యూటింగ్ యుద్ధ తీరును మారుస్తున్నాయని అన్నారు.

## సుప్రీంకోర్టులో ఏఎస్‌జీగా కనకమేడల..

ఢిల్లీ: తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత, మాజీ రాజ్యసభ సభ్యుడు కనకమేడల రవీంద్ర కుమార్‌కు కేంద్ర ప్రభుత్వంలో కీలక పదవి లభించింది. సుప్రీంకోర్టులో అదనపు సొలిసిటర్ జనరల్‌గా (ఏఎస్‌జీ) ఆయన్ను నియమిస్తూ కేంద్ర న్యాయశాఖ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ పదవిలో ఆయన మూడేళ్ల పాటు కొనసాగనున్నారు. ఈ నియామకంతో కనకమేడల సుప్రీంకోర్టులో కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన కీలక కేసుల్లో వాదనలు వినిపిస్తారు. అదనపు సొలిసిటర్ జనరల్ పదవి కేంద్ర ప్రభుత్వ న్యాయవ్యవస్థలో అత్యంత ముఖ్యమైనది. అటార్నీ జనరల్, సొలిసిటర్ జనరల్‌కు సహాయకుడిగా వ్యవహరిస్తూ, సుప్రీంకోర్టు, హైకోర్టులలో ప్రభుత్వం తరపున వాదించాల్సి ఉంటుంది. కనకమేడల రవీంద్ర కుమార్‌కు న్యాయ, రాజకీయ రంగాల్లో సుదీర్ఘ అనుభవం ఉంది. ఆయన సీనియర్ న్యాయవాదిగా సుప్రీంకోర్టు, హైకోర్టులలో పలు కీలక కేసులను వాదించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరపున కూడా గతంలో వాదనలు వినిపించారు. రాజ్యాంగం, పరిపాలన అంశాలపై ఆయనకు మంచి పట్టు ఉంది. 2018 నుంచి 2024 వరకు టీడీపీ తరపున రాజ్యసభ సభ్యుడిగా పనిచేసి, పార్లమెంటులో చురుకైన పాత్ర పోషించారు. టీడీపీ లీగల్ సెల్‌లోనూ కీలక బాధ్యతలు నిర్వర్తించారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో ఈ నియామకం ప్రాధాన్యత సంతరించుకుంది. కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వంలో టీడీపీ కీలక భాగస్వామిగా ఉన్న తరుణంలో, ఆ పార్టీకి చెందిన నేతకు ఇంతటి ముఖ్యమైన న్యాయ పదవి దక్కడం రాజకీయంగా కీలక పరిణామంగా విశ్లేషకులు భావిస్తున్నారు. దీనివల్ల కేంద్రంలో ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించిన కేసుల్లో బలమైన న్యాయ ప్రాతినిధ్యం లభించే అవకాశం ఉందని చెబుతున్నారు.

## శ్రీహరికోటలో బ్లూబర్డ్ బ్లాక్2 మిషన్ కౌంట్‌డౌన్ ప్రారంభం

శ్రీహరికోట: కొత్త తరం అమెరికా కమ్యూనికేషన్ ఉపగ్రహం బ్లూబర్డ్6ను మోసుకెళ్లే ఎల్‌వీఎం3ఎం6 రాకెట్ ప్రయోగానికి 24 గంటల కౌంట్‌డౌన్ మంగళవారం శ్రీహరికోటలో ప్రారంభమైనట్లు ఇస్రో ప్రకటించింది. బ్లూబర్డ్ బ్లాక్2 మిషన్ కౌంట్ డౌన్ ప్రారంభమైందని, రేపు ఉదయం 8.54 గంటలకు రాకెట్ నింగిలోకి ఎగరనున్నట్లు వెల్లడించింది. ఈ ఉపగ్రహం బరువు సుమారు 6,100 కిలోలు ఉంటుంది. స్పేస్‌పోర్ట్‌లోని రెండో లాంచ్ ప్యాడ్ నుంచి ఎల్‌వీఎం3ఎం6 వ్యోమనౌకను ప్రయోగించనున్నట్లు ఇస్రో అధికారులు తెలిపారు. అమెరికాకు చెందిన ఏఎస్టీ స్పేస్ మొబైల్ సంస్థతో కలిసి ఇస్రో వాణిజ్య విభాగం న్యూస్పేస్ ఇండియా లిమిటెడ్ ఈ ప్రయోగాన్ని నిర్వహిస్తోంది. శాటిలైట్ ద్వారా నేరుగా మొబైల్ కనెక్టివిటీ కోసం ఉద్దేశించిన ప్రాజెక్టు ఈ బ్లూబర్డ్ బ్లాక్2 మిషన్. ప్రపంచవ్యాప్తంగా ఎక్కడ ఉన్నా, ఏ సమయంలోనైనా నేరుగా 4జీ, 5జీ వాయిస్, వీడియో కాల్స్, మెసేజ్‌లు, వీడియో ప్రసారాలు చేసేందుకు వీలుగా ఈ ప్రయోగం చేపట్టారు. వాణిజ్య, ప్రభుత్వ అప్లికేషన్లకు సపోర్ట్ చేసేలా దీనిని రూపొందించారు.

## అసెంబ్లీకి రాని కేసీఆర్ మీడియా సమావేశంలో
## ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారు

హైదరాబాద్: రెండేళ్లుగా అసెంబ్లీకి హాజరు కాని కేసీఆర్ మీడియా సమావేశంలో మాత్రం ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా ప్రభుత్వంపై బీఆర్ఎస్ నాయకులు విషం చిమ్ముతున్నారని ఆయన విమర్శించారు. ఖమ్మం జిల్లా తల్లాడ మండలం పినపాక గ్రామంలో నూతన సబ్ స్టేషన్ నిర్మాణానికి ఆయన భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ, ప్రతి పైసా ప్రజల కోసమే ఖర్చు చేస్తున్నామని స్పష్టం చేశారు. తమ ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా దుర్వినియోగం చేయలేదని అన్నారు. వ్యవసాయానికి ఉచిత విద్యుత్ కోసం ప్రతి సంవత్సరం రూ.12,500 కోట్లు విద్యుత్ శాఖకు ప్రభుత్వం చెల్లిస్తోందని భట్టివిక్రమార్క తెలియజేశారు. బీఆర్ఎస్ నాయకులు తోలు తీస్తామంటూ దిగజారి మాట్లాడుతున్నారని, తాము వారిలా మాట్లాడలేమని పేర్కొన్నారు. అలా మాట్లాడే వారికి ప్రజలు తగిన బుద్ధి చెబుతారని వ్యాఖ్యానించారు. కేసీఆర్ అసెంబ్లీకి రావడానికి భయపడుతున్నారని భట్టివిక్రమార్క అన్నారు.

## ఫోన్ ట్యాపింగ్ కేసులో కేసీఆర్, కేటీఆర్ లకు
## నోటీసులు ఇవ్వాలని సిట్ నిర్ణయం!..

హైదరాబాద్: తెలంగాణ రాజకీయాల్లో కలకలం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌లకు నోటీసులు జారీ చేయాలని ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) నిర్ణయించింది. ఈ నిర్ణయంపై కేంద్ర సహాయమంత్రి బండి సంజయ్ స్పందిస్తూ, దీనిని స్వాగతిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా బండి సంజయ్ బీఆర్ఎస్ ప్రభుత్వంపై తీవ్ర ఆరోపణలు చేశారు. తనతో పాటు ఎందరో నేతల ఫోన్లను ట్యాప్ చేయడమే కాకుండా, కుటుంబాల్లో చిచ్చు పెట్టారని విమర్శించారు. "కన్నబిడ్డ, అల్లుడి ఫోన్లనూ ట్యాప్ చేయించి, ఎంతో పేరున్న ఎస్ఐబీ వ్యవస్థను భ్రష్టు పట్టించారు" అని మండిపడ్డారు. ఎస్ఐబీని అడ్డుపెట్టుకొని కాంట్రాక్టర్లు, నేతల నుంచి బ్లాక్ మెయిల్ చేసి డబ్బులు వసూలు చేశారన్న ఆరోపణలపై కూడా సమగ్ర దర్యాప్తు జరపాలని ఆయన డిమాండ్ చేశారు. అయితే, ఈ విచారణపై ఆయన పలు సందేహాలు వ్యక్తం చేశారు. కేవలం నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకొంటారా, లేక దోషులను తేలుస్తారా అని ప్రశ్నించారు. "ఫోన్ ట్యాపింగ్ కేసు



మొదలైనప్పుడు ప్రారంభమైన టీవీ సీరియళ్లు కూడా పూర్తయ్యాయి కానీ, ఈ కేసు మాత్రం ఇంకా కొనసాగుతూనే ఉంది" అని ఎద్దేవా చేశారు. విచారణ అధికారులపై ఎలాంటి ఒత్తిడి లేకుండా వారికి పూర్తి స్వేచ్ఛ ఇవ్వాలని, ఈ కుట్ర వెనుక ఉన్న సూత్రధారులను బయటపెట్టాలని ఆయన కోరారు.

## సౌత్ ఇండియా రాకెట్రీ ఛాలెంజ్
## 2K26 పోస్టర్ ఆవిష్కరించిన సీఎం చంద్రబాబు

విజయవాడ: రాష్ట్రంలోని పాఠశాల, కళాశాల విద్యార్థుల్లో శాస్త్ర సాంకేతిక నైపుణ్యాలను, నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ముందడుగు వేసింది. ఇందులో భాగంగా 'సౌత్ ఇండియా రాకెట్రీ ఛాలెంజ్ 2K26' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. మంగళవారం సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ పోటీలకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ రాకెట్రీ ఛాలెంజ్ ఫైనల్స్ 2026 జనవరి 22వ తేదీ నుంచి 24వ తేదీ వరకు మూడు రోజుల పాటు గుంటూరులోని విజ్ఞాన్ యూనివర్సిటీలో జరగనున్నాయి. ఈ పోటీలను రెండు విభాగాలుగా నిర్వహిస్తున్నారు. 16 ఏళ్లకు పైబడిన కళాశాల విద్యార్థుల కోసం 'కెమికల్ రాకెట్రీ', 6 నుంచి 12 ఏళ్ల మధ్య వయసున్న పాఠశాల విద్యార్థుల కోసం 'హైడ్రో రాకెట్రీ' విభాగాల్లో పోటీలు ఉంటాయి. సైన్స్ సిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో తొలిసారిగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు



మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి, రవాణా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు ముఖ్యమంత్రికి వివరించారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను, ఆలోచనలను వెలికితీయడమే ఈ పోటీల ముఖ్య ఉద్దేశమని వారు తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనాలని ఆసక్తి ఉన్న విద్యార్థులు, యువత.. ప్రభుత్వ అధికారిక వెబ్‌సైట్ science city.ap.gov.in/rocketry_challenge.aspx ద్వారా తమ పేర్లను నమోదు చేసుకోవచ్చని అధికారులు స్పష్టం చేశారు.

# ఢిల్లీలో బంగ్లాదేశ్ హైకమిషన్ ఎదుట ఉద్రిక్తత

బంగ్లాదేశ్: బంగ్లాదేశ్‌లో హిందూ యువకుడు దీపు చంద్ర దాస్ హత్యకు నిరసనగా న్యూఢిల్లీలోని బంగ్లాదేశ్ హైకమిషన్ ఎదుట నిరసనలు కొనసాగుతున్నాయి. గత వారం మైమెన్సింగ్ జిల్లాలో ఇస్లామిస్ట్ గుంపు దాడిలో దీపు దారుణంగా హత్యకు గురికావడం దేశవ్యాప్తంగా ఆగ్రహాన్ని రేపింది. ఈ ఘటనను ఖండిస్తూ విశ్వ హిందూ పరిషత్ (వీహెచ్‌పీ), బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులు, దేవాలయాల ధ్వంసం తక్షణమే ఆపాలని వారు డిమాండ్ చేశారు.



నిరసనల నేపథ్యంలో ఢిల్లీ పోలీసులు హైకమిషన్ పరిసరాల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు. మూడు వరుసల బారికేడ్లు ఏర్పాటు చేసి, పోలీసు, పారా మిలిటరీ దళాలను మోహరించారు. అయినప్పటికీ కొంతమంది నిరసనకారులు బారికేడ్లను తోసుకుంటూ ముందుకు వెళ్లేందుకు ప్రయత్నించారు. దీపు దాస్‌కు న్యాయం చేయాలంటూ ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేశారు. "ఈరోజు మనం గొంతెత్తకపోతే, రేపు ప్రతి ఒక్కరూ దీపే అవుతారు" అంటూ ఒక నిరసనకారి చేసిన వ్యాఖ్య అక్కడి ఉద్రిక్తతను ప్రతిబింబించింది. ఈ నెల 19న బంగ్లాదేశ్ మైమెన్సింగ్‌లోని బలూకాలో 25 ఏళ్ల గార్మెంట్ ఫ్యాక్టరీ కార్మికుడు దీపు చంద్ర దాస్‌పై దైవదూషణ ఆరోపణలతో గుంపు దాడి చేసి, అతని మృతదేహాన్ని తగలబెట్టడం కలకలం రేపింది. ఈ ఘటనలో ఇప్పటివరకు కనీసం 12 మందిని పోలీసులు అరెస్టు చేశారు. ఇదిలా ఉంటే... భారత్‌లోని బంగ్లాదేశ్ దౌత్య కార్యాలయాలపై జరిగిన నిరసనలపై బంగ్లాదేశ్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఢిల్లీలో భారత హైకమిషనర్‌ను పిలిపించి నిరసన తెలిపింది. దౌత్య కార్యాలయాలపై హింస, బెదిరింపులు అంతర్జాతీయ ప్రమాణాలకు విరుద్ధమని బంగ్లాదేశ్ విదేశాంగ మంత్రిత్వ శాఖ పేర్కొంది. ఈ నెల 20న ఢిల్లీలో నిరసన, 22న సిలిగురిలోని బంగ్లాదేశ్ వీసా కేంద్రంపై జరిగిన విధ్వంసాన్ని ప్రస్తావిస్తూ, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని భారత్‌ను కోరింది.

## ఇరుకుంట తాండ సర్పంచ్ గా పి. లక్ష్మణ్ నాయక్ ప్రమాణ స్వీకారం



శంకర్ పల్లి, (ప్రజాస్ఫూర్తి) : ఇటీవల జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికలలో శంకర్ పల్లి మండలం ఇరుకుంట తాండ సర్పంచ్ గా పి. లక్ష్మణ్ నాయక్ గెలుపొందారు. ఈ సందర్భంగా గ్రామస్తుల ఆధ్వర్యంలో ఎంఈఓ అక్బర్ పాలకవర్గంతో మంగళవారం ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం నిర్వహించిన ర్యాలీ గ్రామంలో సందడిగా జరిగింది. ప్రమాణ స్వీకారం అనంతరం గ్రామంలో తమ ఆరాధ్య దైవంగా కొలిచే సేవాలాల్ మహారాజ్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. గ్రామంలోని నివాసితులందరికీ ఇళ్ల పట్టాలు లేనివారికి పట్టాలు అందించేలా కృషి చేయడంతో పాటు మౌలిక వసతులను కల్పించేందుకు నిరంతరం పోరాడుతానన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కిషన్ నాయక్ వార్డు సభ్యులు, గ్రామ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

## ప్రజా పాలనను ఆశీర్వదించారు...

**: ఆత్మ కమిటీ చైర్మన్ కచూర్ రావు**



అందోలు, ప్రజాస్ఫూర్తి : ప్రజా పాలన ప్రభుత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను చూసి ప్రజలు ఆశీర్వదించారని ఆత్మ కమిటీ చైర్మన్ కచూర్ రావు అన్నారు. మంగళవారం వట్ పల్లి లోని ఓ ఫంక్షన్ హాల్ లో కాంగ్రెస్ పార్టీ మద్దతు 16 గ్రామ పంచాయతీల నూతన సర్పంచులను మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. మండలంలో 22 గ్రామపంచాయతీలలో 16 కాంగ్రెస్ పార్టీ మద్దతుదారులు సర్పంచులుగా గెలిచారన్నారు. పార్టీ కార్యకర్తల కృషివల్లే అత్యధిక స్థానాల్లో గెలిచామన్నారు. ప్రజా ప్రభుత్వం అమ్ములు చేస్తున్న సంక్షేమ పథకాల వల్లే ప్రజలు కాంగ్రెస్ పార్టీకి అత్యధిక సర్పంచ్ స్థానాలను కట్టబెట్టారని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రమేష్ జోషి అన్నారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు వెళుతుందన్నారు. రాబోయే ఎంపీటీసీ జెడ్పిటిసి ఎన్నికల్లో పార్టీ కార్యకర్తలు నాయకులు అత్యధిక స్థానాల్లో గెలిపి లక్ష్యంగా ముందుకు వెళ్లేందుకు కృషి చేయాలి అన్నారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ జిల్లా నాయకులు వినయ్ గౌడ్, మాజీ సర్పంచులు శివ చరణ్, సంగారెడ్డి, వీరన్న, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకట పాటిల్, మాజీ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి, ఏయంసి డైరెక్టర్ దిగంబరావ్, ఎన్ ఎస్ యు ఐ నియోజకవర్గ అధ్యక్షుడు కాజా, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు రవీందర్ కళ్యాణ్, యువ నాయకులు అరవింద్, ప్రశాంత్, శంకర్, ప్రవీణ్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## కొత్తగూడెం ఏరియాలో ఘనంగా సింగరేణి దినోత్సవ వేడుకలు




ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: కొత్తగూడెం ఏరియాలో సింగరేణి దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కొత్తగూడెం ఏరియా 3 ఇంక్లైన్‌లోని జనరల్ మేనేజర్ కార్యాలయం ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఎం. షాలేం రాజు హాజరై సింగరేణి పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ముందుగా జి.ఎం. జ్యోతి ప్రజ్వలన చేసి, కేక్ కట్ చేసి ఉద్యోగులందరికీ సింగరేణి దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సింగరేణి దినోత్సవాన్ని జరుపుకోవడం ఎంతో ఆనందదాయకమని పేర్కొన్నారు. సింగరేణి సంస్థ నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటూ ముందుకు సాగుతూ, నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాలను విజయవంతంగా సాధిస్తోందన్నారు. ఈ విజయాల్లో భాగస్వాములైన అధికారులు, కార్మికులు, యూనియన్ నాయకులు, కాంట్రాక్ట్ కార్మికులను ప్రత్యేకంగా అభినందించారు. 137 ఏళ్ల సింగరేణి చరిత్రలో ఎన్నో మైలురాళ్లను అధిగమించడంతో పాటు, అనేక సవాళ్లను ఎదుర్కొని ఈ రోజు తెలంగాణ రాష్ట్రంలో అతిపెద్ద ప్రభుత్వరంగ సంస్థగా, ఇతర ప్రభుత్వ సంస్థలకు మార్గదర్శకంగా నిలవడం గర్వకారణమని పేర్కొన్నారు. ఈ సంస్థలో పని చేయడం ప్రతి ఉద్యోగికి గర్వకారణమని అన్నారు. సింగరేణి ఆవిర్భావ దినోత్సవాన్ని వైభవంగా జరుపుకోవడం మన అందరి కర్తవ్యమని స్పష్టం చేశారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కొత్తగూడెం ఏరియాకు నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాలను భద్రతతో సాధించడంలో కీలక పాత్ర పోషించిన ఉద్యోగులు, సూపర్వైజర్లు, యూనియన్లు, అధికారులను ఆయన అభినందించారు. మిగిలిన మూడు నెలల కాలంలో కూడా ఇదే స్ఫూర్తితో ఉత్పత్తి లక్ష్యాలను సాధించాలని పిలుపునిచ్చారు. అనంతరం ఈ ఆర్థిక సంవత్సరంలో ఉత్పత్తి లక్ష్యాల సాధనలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉద్యోగులు, అధికారులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమం చివర్లో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు వీక్షకులను విశేషంగా అలరించాయి. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం ఏరియా జి.ఎం. ఎం. షాలేం రాజుతో పాటు, ఏరియా సేవా ప్రెసిడెంట్ జి. మధురవాణి, ఐఎన్‌టీయూసీ వైస్ ప్రెసిడెంట్ ఎం.డి. రజాక్, సి.ఎం.ఓ.ఏ. ఏరియా ప్రెసిడెంట్ ఎం.వి. నరసింహారావు, ఏరియా ఇంజనీర్ కే. సూర్యనారాయణ రాజు, ఇన్‌చార్జ్ ఎస్ఓటు జి.ఎం. ఎం. వెంకటేశ్వర్లు, ఏజీఎం (పర్సనల్) జి.వి. మోహన్ రావు, ఏజెంట్ పద్మావతి ఖని రామ్ భరోస్ మహాతో, సేవ సెక్రటరీ వై. అనిత, అన్ని విభాగాల అధిపతులు, అధికారులు, సూపర్వైజర్లు, ఉద్యోగులు, సేవా సభ్యులు, జి.ఎం. కార్యాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

# దేశ సంస్కృతి, రాజ్యాంగ విలువలు, సమాజ సేవా భావనలు ఉపాధ్యాయులకు ప్రేరణగా నిలుస్తాయి

*** కేంద్ర ప్రభుత్వ విద్యా మంత్రిత్వ శాఖ ఇన్నోవేషన్ సెల్ డైరెక్టర్ యోగేష్ బ్రహ్మనకర్**





జీడిమెట్ల, ప్రజాస్ఫూర్తి : మనదేశ మూలాలు మన సంస్కృతి, రాజ్యాంగ విలువలు, సమాజ సేవా భావనలు ఉపాధ్యాయులకు ప్రేరణగా నిలుస్తాయని కేంద్ర ప్రభుత్వ విద్యా మంత్రిత్వ శాఖ ఇన్నోవేషన్ సెల్ డైరెక్టర్ యోగేష్ బ్రహ్మనకర్ అన్నారు. స్థానిక గుండ్లపోచంపల్లి పరిధిలోని నర్సింహారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో పీఎం శ్రీ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల కోసం ఐడీఈ బూట్‌క్యాంప్ మంగళవారం రెండవ రోజు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కేంద్ర ప్రభుత్వ విద్యా మంత్రిత్వ శాఖ ఇన్నోవేషన్ సెల్ డైరెక్టర్ యోగేష్ బ్రహ్మనకర్ పాల్గొని ప్రసంగించారు. ఈ ఇన్నోవేషన్, డిజైన్ థింకింగ్ సెషన్‌ల ద్వారా మీరు విద్యార్థుల అవసరాలను అర్థం చేసుకుని, సృజనాత్మక ఐడియా లను రూపొందించి, ప్రోటోటైప్‌లు తయారు చేస్తూ మార్గం సుగమం చేయాలన్నారు. ఈ దేశపు మూలాలతో అనుసంధానమైన ఇన్నోవేషన్ మాత్రమే మన విద్యార్థులను ప్రపంచ స్థాయి పౌరులుగా తయారు చేయగలదని, ఐడియా ఎగ్జిక్యూషన్‌లో అడ్డంకులు వచ్చినా వనరుల కొరత, తల్లిదండ్రుల నిరాశలు, సమయ సమస్యలు వాటిని ముందుగా ఊహించి పరిష్కారాలు సిద్ధం చేసుకోవలని, విద్యార్థులను ప్రేరేపించి, ప్రోత్సహించి, ప్రతి చిన్న ప్రయత్నాన్ని గుర్తించాలన్నారు. విఫలతలను అనుభవంగా మలిచి మళ్లీ ప్రయత్నించే ధైర్యాన్ని నింపాలన్నారు. మీరు రూపొందించిన ప్రాక్టికల్ సొల్యూషన్స్ పాఠశాలల్లో అమలయ్యేలా చేస్తే, మన విద్యా వ్యవస్థ పరివర్తనమవుతుందన్నారు. ఇదే మన బాధ్యత, సంకల్పం అని తెలిపారు. మహీంద్రా అండ్ మహీంద్రా సీఈఓ ఇస్మాయిల్ మాట్లాడుతూ పాత పద్ధతుల్లో చిక్కుకుని కొత్త ఆవిష్కరణలను, డిజైన్ థింకింగ్‌ను తిరస్కరించకుండా, ధైర్యంగా అంగీకరించి విద్యార్థుల ముందు మార్పును చూపాలన్నారు. ఇతరులను నిందించడం మాని, మీ మనస్తత్వంలో మార్పు తీసుకురావడం ద్వారా మాత్రమే నిజమైన పరివర్తన జరుగుతుందని, ప్రతి చిన్న విషయానికి ఇతరులపై ఆధారపడకుండా, అందరూ స్వయం సమృద్ధి అలవర్చుకోవాలన్నారు. వనరులు, సమయం, ఐడియాలు మన చేతిలోనే ఉన్నాయన్నారు. పాఠశాల స్థాయిలో చిన్న చిన్న మార్పులతో ప్రారంభించి, విద్యార్థుల్లో స్వావలంబన భావనను పెంపొందించాలని తెలిపారు. రైతే దేశానికి వెన్నెముకని, ఆ దిశగా దేశ పౌరులు రైతులను ఎల్లప్పుడూ గౌరవించాలని, జై కిసాన్ అనే నినాదాన్ని ఎలుగెత్తి చాటాలని తెలిపారు. అనంతరం నేడు కిసాన్ దివస్ సందర్భంగా కళాశాల ప్రాంగణంలో వారి సమక్షంలో చెట్లు నాటారు. ఈ కార్యక్రమానికి కళాశాల ఛైర్మన్ జె నర్సింహారెడ్డి, కార్యదర్శి జె త్రిశూల్ రెడ్డి, కోశాధికారి త్రిలోక్ రెడ్డి, కళాశాల డైరెక్టర్ డా ఏ మోహన్, కళాశాల ప్రిన్సిపాల్ డా. ఆర్. లోకనాథం, కార్యక్రమ సమన్వయకర్త డా. శోభన్, శ్రీ లక్ష్మి, ఎంబీఏ విభాగాధిపతి డా. నాగ రాజు, డీన్ ప్రసాద్, వెంకటేశ్, సిఎస్ఈ విభాగాధిపతి ప్రొ. రమేశ్, ఐటి విభాగాధిపతి సౌమ్య, ఎఫ్ఎంఈ విభాగాధిపతి సాయి కిరణ్మయి, మెకానికల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి సింహన దేవి, తదితరులు పాల్గొన్నారు.



## కిన్నెరసాని ప్రకృతి సౌందర్యాన్ని ప్రపంచానికి తెలియజేయాలి

*** జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్**

ప్రజా స్ఫూర్తి;భద్రాద్రి కొత్తగూడెం: కిన్నెరసాని ప్రకృతి సౌందర్యాన్ని ప్రపంచానికి తెలియజేయాలి అని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ పిలుపునిచ్చారు. ఏరు రివర్ ఫెస్టివల్‌లో భాగంగా మంగళవారం ఆళ్లపల్లి మండలం రాయపాడు గ్రామం నుండి మొతలగూడెం వరకు కిన్నెరసాని రివర్ వాక్ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఉదయం 8.00 గంటలకు ప్రారంభమైన ఈ రివర్ వాక్‌లో యువత పెద్ద ఎత్తున ఉత్సాహంగా పాల్గొని, కిన్నెరసాని నది పరిరక్షణ, పర్యావరణ సంరక్షణ, నదుల ప్రాధాన్యతపై ప్రజల్లో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ స్వయంగా, ట్రైనీ కలెక్టర్ సౌరబ్ శర్మ, యువతతో కలిసి రివర్ వాక్‌లో పాల్గొని వారితో మమేకమయ్యారు. నది తీర ప్రాంతాల వెంట సాగిన ఈ వాక్ సందర్భంగా జిల్లాలో పర్యాటక రంగ అభివృద్ధికి ఉన్న విస్తృత అవకాశాలు, కిన్నెరసాని నది పరిసర ప్రాంతాల సహజ సంపద, అలాగే జిల్లాలోని వివిధ పర్యాటక ప్రాంతాల విశిష్టతను యువతకు కలెక్టర్ వివరించారు. జిల్లాలో ఉన్న అటవీ ప్రాంతాలు, నదులు, జలపాతాలు, ప్రకృతి వనరులు పర్యాటకులను ఆకర్షించే సామర్థ్యం కలిగి ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. ఈ విధంగా జిల్లాలోని వివిధ పర్యాటక ప్రాంతాల ప్రత్యేకతలను యువతకు వివరిస్తూ రివర్ వాక్ కార్యక్రమం ముందుకు సాగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, కిన్నెరసాని నది జిల్లా జీవనాధారంగా ఉండటంతో పాటు పర్యావరణ సమతుల్యతకు కీలక పాత్ర పోషిస్తోందని అన్నారు. నది చుట్టూ ఉన్న పచ్చని అడవులు, సహజ వనరులు, జీవ వైవిధ్యం భవిష్యత్ తరాలకు కాపాడాల్సిన అమూల్యమైన సంపద అని తెలిపారు. ఈ ప్రకృతి సౌందర్యాన్ని సంరక్షించుకుంటూనే దేశ విదేశాలకు పరిచయం చేస్తే జిల్లాలో పర్యాటక రంగం మరింతగా అభివృద్ధి చెందుతుందని తెలిపారు. ఏరు రివర్ ఫెస్టివల్ ప్రధాన లక్ష్యం జిల్లాలోని నదుల, పర్యావరణ పరిరక్షణతో పాటు పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయడమేనని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. పర్యాటక రంగం అభివృద్ధి చెందితే స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని, రవాణా, స్థానిక ఉత్పత్తుల విక్రయాల ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని వివరించారు. యువత సోషల్ మీడియా, డిజిటల్ వేదికల ద్వారా కిన్నెరసాని నది ప్రకృతి అందాలు, జిల్లాలోని పర్యాటక ప్రాంతాల విశిష్టతను ప్రపంచానికి తెలియజేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఫోటోగ్రఫీ, వీడియోలు, డాక్యుమెంటరీలు, రీల్స్, బ్లాగుల ద్వారా ఈ ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేసేలా కృషి చేయాలని సూచించారు. అదే సమయంలో నదులను కాలుష్యరహితంగా ఉంచడం, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం ప్రతి పౌరుడి బాధ్యత అని అన్నారు.జిల్లాలో పర్యాటక రంగం అభివృద్ధి దిశగా, పర్యావరణ పరిరక్షణకు తోడ్పడేలా ఇలాంటి అవగాహన కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని జిల్లా కలెక్టర్ ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి యం. పరంధామ రెడ్డి, స్థానిక అల్లపల్లి మండల ఎంపీడీవో శ్రీను, తహసిల్దార్ జగదీశ్వర ప్రసాద్, ఎంఈఓ సంతా రావు, కృష్ణయ్య, గ్రామ సర్పంచ్ చిన్న పాపయ్య, పంచాయతే సెక్రెటరీ వరుణ్, టి ఎన్జీవోస్ ఉద్యోగ సంఘాల నాయకులు భార్గవ్ చైతన్య, అథ్లెటిక్స్ అసోసియేషన్ సెక్రెటరీ మహిధర్, నాగేంద్ర, ఆర్చెరీ కోచ్ కల్యాణ్, సైకిలింగ్ నాగేశ్వర రావు, ఉదయ్ కుమార్, టైక్వాండో రమేశ్, ఎన్సిసి, ఎన్ఎస్ఎస్, స్థానిక యువత, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

## అమ్మవారి ఆశీస్సులతో ప్రజలంతా ఆయురారోగ్యాలతో ఉండాలి



బిఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్

జగద్గిరిగుట్ట, (ప్రజాస్ఫూర్తి ) : వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని బిఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి. వివేకానంద్ అకాంక్షించారు. జగద్గిరిగుట్ట డివిజన్ జగద్గిరిగుట్ట పై గల కన్యకా పరమేశ్వరి దేవాలయంలో నిర్వహించిన శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి దేవస్థానం ఆధ్వర్యంలో నూతనంగా రూపొందించిన 2026 సంవత్సర క్యాలెండర్ ను బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్, స్థానిక కార్పొరేటర్ కొలుకుల జగన్ లు పాల్గొని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ధర్మం, న్యాయం, త్యాగానికి ప్రతీక అయిన వాసవీ మాత ఆశీస్సులు సమాజానికి ఎల్లప్పుడూ ఉండాలన్నారు. అంతకముందు వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారిని దర్శించుకుని వారు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు రుద్ర అశోక్, శ్రీ వెంకటేశ్వర దేవస్థానం మాజీ చైర్మన్ వేణు యాదవ్, శ్రీ కన్యకా పరమేశ్వరి దేవస్థానం ఆలయ కమిటీ చైర్మన్ నేతి శంకర్ గుప్తా, ఫౌండర్ చైర్మన్ రేగురి ప్రవీణ్ కుమార్ గుప్తా, గౌరవ చైర్మన్ కాశం కైలాసం గుప్తా, అధ్యక్షులు ఉప్పల రమేష్ గుప్తా, ప్రధాన కార్యదర్శి లక్ష్మణరావు గుప్తా, ట్రెజరర్ మహంకాళి సురేష్ గుప్తా, అడిషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ గంజి స్వామి గుప్తా, జాయింట్ సెక్రెటరీ అంగడి సత్యనారాయణ గుప్తా, ఉపాధ్యక్షులు లక్ష్మీనరసయ్య గుప్తా, షెర్విరాల కృష్ణమూర్తి గుప్తా, పులిగిల్ల నర్సింహులు గుప్తా, గజ్జి ఉపేందర్ గుప్తా, డివిజన్ మైనార్టీ నాయకులు అజమ్, నాయకులు పాపులు గౌడ్, బాబు గౌడ్, మల్లేష్ గౌడ్, జైహింద్, బ్రహ్మానంద చారి, అంజయ్య, మహేందర్, నాని, విగ్నేష్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

## సంఘ సభ్యులందరూ ఐకమత్యంతో సంఘం అభివృద్ధికి కృషి చేయాలి

*** బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్**



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : సంఘ సభ్యులందరూ ఐకమత్యంతో సంఘం అభివృద్ధికి కృషి చేయాలని బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ అన్నారు. గాజుల రామారం డివిజన్ దేవేందర్ నగర్, కైసర్ నగర్ లోనీ ఓం మణికంఠ నాయి బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బోర్ & ట్రాన్స్ ఫార్మర్ ల ప్రారంభోత్సవ కార్యక్రమానికి బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై బోరు ప్రారంభించగా, సుమారు 5 లక్షల రూపాయల సొంత నిధులతో బోరును వేయించి నాయి బ్రాహ్మణ సేవా సంఘం అభివృద్ధికి నిత్యం కృషి చేస్తున్న ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ కి సంఘ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మాట్లాడుతూ సంఘం శరణం గచ్ఛామి, ఐకమత్యమే మహాబలమని అన్నారు. నాయి బ్రాహ్మణ సేవా సంఘం కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులల్లో భాగంగా నూతనంగా బోరును, ట్రాన్స్ఫార్మర్లను ప్రారంభించడం జరిగిందన్నారు. రానున్న కాలంలో నాయి బ్రాహ్మణుల సేవా సంఘం భవన నిర్మాణాన్ని పూర్తిచేసి నాయి బ్రాహ్మణుల అభ్యున్నతికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఓం మణికంఠ నాయి బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షులు గడిల వెంకటేశ్వర్లు నాయి, ప్రధాన కార్యదర్శి విఎస్ఆర్ వెంకటేష్‌నాయి , మాజీ అధ్యక్షులు రేనయ్య నాయి, మాజీ ప్రధాన కార్యదర్శి పరమేష్ నాయి, మాజీ ఎలక్షన్ కమిటీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ , సంఘ సభ్యులు, పాక్స్ డైరెక్టర్ పరుష శ్రీనివాస్ యాదవ్, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు కస్తూరి బాల్ రాజ్, అడ్వకేట్ కమలాకర్, నవాబ్ భాయ్, తెలంగాణ సాయి, ఇబ్రహీం ఖాన్, మూసా ఖాన్, సుంకరి చందు, నాగేష్, చిన్నా చౌదరి, బాబీ చౌదరి, సాయిబాబ, నవీన్, శ్రీరాములు గౌడ్, చంద్ర శేఖర్ గౌడ్, ప్రసాద్, శివా నాయక్, జునైద్, గౌస్, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

## క్రిస్మస్ అంటే శాంతి, కరుణ, ప్రేమ

* ప్రతి ఒక్కరూ శాంతి, సేవాగుణాన్ని అలవర్చుకోవాలి..
* రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా..
* జోగిపేటలో క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న మంత్రి



అందోలు, ప్రజాస్ఫూర్తి: క్రిస్మస్ అంటే ఐక్యతతో పాటు శాంతి, కరుణ, ప్రేమ సందేశాలను సమాజానికి చాటి చెప్పే పవిత్ర పండుగ అని రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. మంగళవారం జోగిపేటలో నిర్వహించిన క్రిస్మస్ ముందస్తు వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కేక్ కట్ చేసి, క్రైస్తవ సోదరసోదరీమణులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఏసు ప్రభువు చూపిన కరుణ, దయ మార్గం మానవాళికి ఆదర్శమన్నారు. సమాజంలో శాంతి సామరస్యాలు వెల్లివిరియాలని, ప్రతి ఒక్కరూ తోటి వారికి సహాయం చేసే గుణాన్ని అలవర్చుకోవాలని సూచించారు. తమ మతాన్ని ఆరాధిస్తూనే, ఇతర మతాలను గౌరవించాలన్నారు. అన్ని వర్గాల పండుగలను గౌరవించి, ప్రభుత్వం తరపున అధికారికంగా నిర్వహిస్తున్నామని మంత్రి తెలిపారు. క్రైస్తవుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పలు చర్చిల నుంచి పాస్టర్లు, క్రైస్తవ మత పెద్దలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## గ్రూప్1 పిటిషన్లపై విచారణ రేపటికి వాయిదా



హైదరాబాద్: TGPSC గ్రూప్ 1 పిటిషన్లపై హైకోర్టులో వాదనలు కొనసాగాయి. మంగళవారం టీజీపీఎస్సీతో పాటు గ్రూప్ 1కు ఎంపికైన అభ్యర్థుల తరపున వాదనలు ముగియగా.. తదుపరి విచారణను కోర్టు బుధవారానికి వాయిదా వేసింది. ప్రతివాదుల వాదనలను బుధవారం విననుంది. గ్రూప్ 1పై సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ.. టీజీపీఎస్సీతో పాటు గ్రూప్ 1 కు ఎంపికైన కొందరు అభ్యర్థులు కోర్టుల అప్పీల్ పిటషన్లు దాఖలు చేశారు. ఈవాల్యుయేషన్ పాదర్శకంగా జరిగినట్లు టీజీపీఎస్సీ పిటిషనర్ల తరపు న్యాయవాదులు కోర్టుకు తెలిపారు. గ్రూప్ 1 ఉద్యోగానికి ఎంపికకాని అభ్యర్థులు అపోహలతో పిటిషన్లు వేశారని, వాటిపై ఇరుపక్షాల వాదనలు విన్న సింగిల్ బెంచ్ ఎలాంటి ఆధారాలు లేకుండా ఎంపిక లిస్టును రద్దు చేసిందన్నారు. కాగా.. టీజీపీఎస్సీ విడుదల చేసిన ప్రకటనలోనే పరీక్షకు హాజరైన అభ్యర్థుల సంఖ్య విషయంలో తేడాలున్నట్లుగా పలు అనుమానాలకు తావిస్తోందని ప్రతివాదుల తరపు న్యాయవాది సురేందర్ కోర్టుకు తెలిపారు.

## ప్రజాస్వామ్య దేశానికి పరిపాలన దక్షకుడు పివీ

: స్పీకర్ గడ్డం ప్రసాద్



హైదరాబాద్, ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య దేశానికి పరిపాలన దక్షకుడిగా పివీ నరసింహ రావు ఖ్యాతి పొందారని, దేశానికి ప్రధాని అయిన తెలంగాణ ముద్దు బిడ్డ పీవీ అని రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. ఆయన ఆర్థికవేత్త, సంస్కరణలకర్తగా చరిత్రలో నిలిచారని గడ్డం ప్రసాద్ కుమార్ వివరించారు. దేశ మాజీ ప్రధాని పీవీ నరసింహ రావు వర్ధంతి సందర్భంగా మంగళవారం శాసనసభ భవనం లాబీ హాల్ లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ లు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ ఇవాళ దేశం ఆర్థిక సమస్యలను తట్టుకుని నిలబడుతోంది అంటే దానికి కారణం పివీ అని, ఆయన చూపించిన బాటలో మనమందరం పయనించాలని ఆయన సూచించారు. గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ పీవీ నరసింహ రావు దేశానికి ఎనలేని సేవ చేశారని, ప్రధానిగా ఆయన ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చి ఆర్థికవేత్తగా దేశాన్ని ముందుకు నడిపించారని అన్నారు. పీవీ గొప్ప మేధావి, బహుభాషా కోవిదుడని, 14 భాషల్లో అనర్గళంగా మాట్లాడేవారన్నారు. పీవీ నరసింహా రావు నిజాయితీకి, నిరాడంబరతకు నిలువుటద్దమని గుత్తా సుఖేందర్ రెడ్డి కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీలు వాణీదేవి, బోగరపు దయానంద్, లెజిస్లేచర్ సెక్రటరీ వి. నరసింహ చార్యులు, పీవీ కుటుంబ సభ్యులు, సీఎల్పీ సెక్రెటరీ శ్రీకాంత్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# నాడు కళకళ... నేడు వెలవెల...

* బోసిపోయిన ప్రకాశం స్టేడియం
* కానరాని సింగరేణి 'డే' వేడుకలు



ప్రజా స్ఫూర్తి; భద్రాద్రి కొత్తగూడెం: సిరుల తల్లి సింగరేణి కార్మికుల గుండెల్లో గర్వంగా మోగే నినాదం "జై సింగరేణి.. జై జై సింగరేణి". కానీ ఈ ఏడాది ఆ నినాదం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో వినిపించలేదు. సింగరేణి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రతి ఏడాది సింగరేణి వ్యాప్తంగా నెల రోజుల ముందు నుండే సందడి మొదలయ్యేది. గనులు, డిపార్ట్‌మెంట్‌లతోపాటు కార్మిక వాడల్లో వివిధ ఆటల పోటీలు నిర్వహించేవారు. గెలుపొందిన వారికి సింగరేణి డే వేడుకల్లో బహుమతులు అందించేవారు. సింగరేణి ఆవిర్భావ దినోత్సవమైన డిసెంబర్ 23వ తేదిన అన్ని ఏరియాల్లో ప్రత్యేకంగా వేడుకలు నిర్వహించడంతోపాటు కొత్తగూడెం కార్పొరేట్ పరిధిలోని ప్రకాశం స్టేడియంలో ప్రధాన వేడుకలు నిర్వహించేవారు. ఏడాదికేడాది కళకళలాడే కొత్తగూడెం ప్రకాశం స్టేడియం ఈసారి వెలవెలబోయింది. సింగరేణి డే వేడుకలు లేవు... సంబరాలు లేవు.. కార్మిక కుటుంబాల ముఖాల్లో చిరునవ్వులే లేవు. ప్రతి ఏడాది సింగరేణి యాజమాన్యం అత్యంత ఘనంగా నిర్వహించే సింగరేణి డే వేడుకలు ఈసారి కేవలం ప్రధాన కార్యాలయాలు, ఏరియా జీఎం కార్యాలయాలకు పరిమితమయ్యాయి. ప్రభుత్వ బడ్జెట్ కోతలే ఇందుకు కారణమని తెలుస్తోంది. ఫలితంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంగా ఉన్న కొత్తగూడెం ప్రకాశం స్టేడియం ఈసారి నిశ్శబ్దానికి చిరునామాగా మారింది దీంతో చేసేది ఏమీ లేక కొందరు కార్మికులు గళం ఎత్తే పరిస్థితి లేక స్టేటస్ లో పెట్టుకొని తమ ఆవేదాన్ని వ్యక్తం చేశారు. కార్మికులకు పండుగ లాంటి రోజు.... కానీ... సింగరేణి డే అంటే కార్మికులకు కేవలం ఒక వేడుక కాదు.. వారి శ్రమకు లభించే గుర్తింపుగా భావిస్తారు. తమ కుటుంబాలతో కలిసి ఆనందాన్ని పంచుకునే పండుగగా చేసుకుంటారు. ప్రతి ఏడాది బుల్లితెర, సినీ కళాకారులతోపాటు ప్రత్యేకంగా జబర్దస్త్ టీమ్‌తో ప్రత్యేక కార్యక్రమాలు, సాంస్కృతిక పోటీలు, చిన్నారులను అలరించే ఆటలు, వివిధ రకాల స్టాళ్లతో ప్రకాశం స్టేడియం పండుగ వాతావరణాన్ని సంతరించుకునేది. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా వివిధ గనుల్లో పనిచేస్తూ ఉత్తమ ప్రతిభ కనబరిచిన కార్మికులకు అవార్డులు అందజేసి ప్రోత్సహించేవారు. కానీ ఈసారి అవార్డులు, వేదికలు లేవు. కార్మిక కుటుంబాల కేరింతలు కరువయ్యాయి.

* నిరాశలో కార్మికులు.. మౌనంగా కుటుంబాలు

సింగరేణి డే రాకతో నెలల ముందే ఏర్పాట్లపై చర్చలు, కుటుంబాలతో ప్లాన్‌లు, పిల్లల్లో ఉత్సాహం కన్పించేది. ఇవన్నీ ఈసారి అర్థాంతరంగా ఆగిపోయాయి. "మా శ్రమకు ఇది బహుమానమా?" అనే ప్రశ్న కార్మికుల గుండెల్లో మెదులుతోంది. బడ్జెట్ కోతల పేరుతో కార్మికుల భావోద్వేగాలను పక్కన పెట్టడమేనా? సింగరేణి లాభాల్లో ఉన్నా, కార్మికుల పండుగను కుదించాల్సిన అవసరముందా? అనే ప్రశ్నలు ఇప్పుడు వినిపిస్తున్నాయి. రాష్ట్రానికి ఆదాయాన్ని అందిస్తున్న సింగరేణి, రాత్రింబవళ్లు ప్రాణాలను పణంగా పెట్టి బొగ్గు గనుల్లో పనిచేస్తున్న కార్మికులు. వారి కోసం ఏడాదికి ఒక్కసారి జరిగే వేడుకను కూడా నిర్వహించలేని పరిస్థితి రావడం బాధాకరం. నాడు కళకళలాడిన కొత్తగూడెం ప్రకాశం స్టేడియం, నేడు వెలవెలబోయి కన్పించింది. తిరిగి సింగరేణి డే నిజమైన పండుగలా ఎప్పుడు మారుతుందోనని కార్మిక లోకమంతా ఎదురు చూస్తున్నారు.ఇది ఇలా ఉండగా ఘనంగా జరుపుకుని సింగరేణి డేనే కార్యాలయాలకు పరిమితం చేస్తే.. రాబోయే రోజులలో సింగరేణి పరిస్థితి ఏమవుతుందో అన్న ఆందోళనలో ఉన్నారు కార్మికులు, కార్మికులు కుటుంబాలు..!?



## సింగరేణి ప్రధాన కార్యాలయంలో ఘనంగా ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం : కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయంలో కార్పొరేట్ ఆధ్వర్యంలో మంగళవారం సింగరేణి ఆవిర్భావ దినోత్సవ ప్రధాన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సింగరేణి డైరెక్టర్ (ఆపరేషన్స్) ఎల్. వి. సూర్యనారాయణ, విశిష్ట అతిథులుగా డైరెక్టర్ (పి అండ్ పి) కే. వెంకటేశ్వర్లు, డైరెక్టర్ (ఈ అండ్ ఎం) ఎం. తిరుమల రావు హాజరయ్యారు.ఎస్&పిసి స్కౌట్స్ కలర్ పార్టీ ముఖ్య అతిథులను వేదిక వద్దకు తీసుకురాగా, డైరెక్టర్ (ఆపరేషన్స్) ఎల్.వి. సూర్యనారాయణ సింగరేణి పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం అందరూ కలిసి సింగరేణి గేయాన్ని ఆలపించారు. తరతరాల శ్రమే సింగరేణి బలం ఈ సందర్భంగా ఎల్.వి. సూర్యనారాయణ మాట్లాడుతూ సింగరేణి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సంస్థ వ్యాప్తంగా పనిచేస్తున్న కార్మికులు, సూపర్వైజరీ సిబ్బంది, అధికారులు, కార్మిక సంఘాల నాయకులు, వారి కుటుంబ సభ్యులు, పాత్రికేయులు, స్థానిక ప్రజలందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.137 ఏళ్ల సుదీర్ఘ చరిత్ర కలిగిన సింగరేణి సంస్థ ఈ స్థాయికి చేరుకోవడానికి కారణం ఒక్క కాలం కాదు, ఒక్క నిర్ణయం కాదని, తరతరాలుగా సాగిన శ్రమ, క్రమశిక్షణ, పరస్పర విశ్వాసమే సంస్థకు నిజమైన బలమని పేర్కొన్నారు. ఈ ఏడాది సంస్థ పనిచేసిన పరిస్థితులు సవాళ్లతో నిండినవని, వాతావరణ మార్పులు, సాంకేతిక సమస్యలు, మార్కెట్‌లో వచ్చిన మార్పులు ఉత్పత్తిపై ప్రభావం చూపినప్పటికీ, భద్రతకు ప్రథమ ప్రాధాన్యం ఇచ్చి అందుబాటులో ఉన్న వనరులను సమర్థంగా వినియోగిస్తూ ముందుకు సాగినట్లు తెలిపారు.భవిష్యత్తుపై దృష్టి ప్రతి గని కార్మికుడు, ప్రతి సూపర్వైజర్, ప్రతి అధికారి చూపిన బాధ్యతాభావం ప్రశంసనీయం అని పేర్కొన్న ఆయన, ఫలితాలకన్నా ముందుగా ఈ కట్టుబాటే సింగరేణి భవిష్యత్తుకు మార్గదర్శకమని అన్నారు. మారుతున్న శక్తి రంగం, సాంకేతికత, అవసరాల నేపథ్యంలో సంస్థ భవిష్యత్తుపై సీరియస్‌గా ఆలోచన ప్రారంభించామని, ఉత్పత్తి సామర్థ్యం, సంస్థ స్థిరత్వం, భవిష్యత్ అవకాశాలపై చర్చలు సాగుతున్నాయని తెలిపారు. కీలక ఖనిజాలు, అనుబంధ రంగాల్లో అవకాశాలపై కూడా పరిశీలన జరుగుతోందని చెప్పారు. పునరుత్పాదక శక్తి, శక్తి సామర్థ్యం వంటి రంగాల్లో సింగరేణి పాత్రపై ఆలోచన కొనసాగుతోందని, ఇవన్నీ సంస్థ తన సామాజిక బాధ్యతను విస్తృతంగా అర్థం చేసుకునే ప్రయత్నాలేనని వివరించారు. కార్మిక భద్రత, సంక్షేమమే ప్రథమ ప్రాధాన్యం సింగరేణి బలం ఉత్పత్తిలో కాదు... మనుషుల్లోనే ఉందని స్పష్టం చేసిన ఆయన, కార్మికుల భద్రత, సంక్షేమం, నైపుణ్యాభివృద్ధి ఎప్పటికీ ప్రధాన ప్రాధాన్యాలేనన్నారు. ప్రమాదాలను పూర్తిగా తొలగించడం సాధ్యం కాకపోయినా, వాటిని తగ్గించేందుకు సంస్థ చేస్తున్న ప్రయత్నాలే నిజమైన ప్రమాణమని అన్నారు. సామాజిక బాధ్యతలో భాగంగా పరిసర ప్రాంతాల అభివృద్ధి, విద్య, ఉపాధి అవకాశాల కల్పనలో సింగరేణి తన వంతు పాత్రను నిశ్శబ్దంగా కొనసాగిస్తోందన్నారు.

**మహిళా శక్తి పెరుగుదల సానుకూల మార్పు**

గనులు, ఆపరేషన్లు, రక్షణ బృందాల్లో మహిళల భాగస్వామ్యం పెరుగుతుండటం సింగరేణి పరిణతిని సూచిస్తోందని చెప్పారు. రెస్క్యూ జట్ల విజయాలు, గనుల నిర్వహణలో లభిస్తున్న గుర్తింపులు మరింత మెరుగ్గా పనిచేయడానికి స్ఫూర్తినిస్తున్నాయని అన్నారు. మొత్తంగా సింగరేణి ప్రస్తుతం ఒక సంధికాలంలో ఉందని, తొందరపడి హామీలు ఇవ్వాల్సిన అవసరం లేదని, అలాగే భవిష్యత్తును వాయిదా వేయకూడదని తెలిపారు. సరైన వేగంతో, సరైన దిశలో, పరస్పర విశ్వాసంతో ముందుకు సాగితే సింగరేణి కొత్త కాలానికి తగినట్టుగా మారుతుందనే నమ్మకం వ్యక్తం చేశారు. సింగరేణి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కార్పొరేట్ పరిధిలో ఉత్తమ అధికారిగా ఎంపికైన బి. శ్రీనివాస రావు (జి.ఎం - ఎక్స్ప్లోరేషన్), ఉత్తమ ఎన్‌సిడబ్ల్యూ ఉద్యోగులుగా ఎంపికైన కే. వెంకటేశ్వర ప్రసాద్ (సీనియర్ సీటీ టెక్నీషియన్ - మెయిన్ హాస్పిటల్), డి.వి.వి. నాగేంద్ర ప్రసాద్ (ఫిట్టర్ - సెంట్రల్ వర్క్‌షాప్) లను సన్మానించారు.అనంతరం మెయిన్ ఆసుపత్రిలో నిర్వహించిన వెల్ బేబీ షోలో విజేతలుగా నిలిచిన చిన్నారులకు బహుమతులు అందజేశారు. జి.ఎం. (పర్సనల్), వెల్ఫేర్ & సిఎస్ఆర్ జి.వి. కిరణ్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రాతినిధ్య సంఘం (ఐఎన్‌టీయూసీ) సీనియర్ వైస్ ప్రెసిడెంట్ సి. త్యాగరాజన్, సింగరేణి సిఎంఓఏఐ ప్రెసిడెంట్ టి. లక్ష్మిపతి గౌడ్, కార్పొరేట్ పరిధిలోని వివిధ శాఖల జనరల్ మేనేజర్లు, శాఖాధిపతులు, యూనియన్ నాయకులు, ఉత్తమ అధికారి, ఉత్తమ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, వెల్ఫేర్ సిబ్బంది, ఎస్&పిసి సిబ్బంది, సేవా సెక్రటరీలు, అధికారులు, ఉద్యోగులు, పాఠశాలల విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## న్యూఇయర్ వేళ మందుబాబులకు గుడ్ న్యూస్

హైదరాబాద్ : న్యూఇయర్ వేడుకలకు ప్లాన్ చేసుకునే వారికి తెలంగాణ ప్రభుత్వం శుభవార్త చెప్పింది. న్యూ ఇయర్ సందర్భంగా డిసెంబర్ 31వ తేదీన అర్ధరాత్రి 12 గంటల వరకు వైన్స్ షాపులు ఓపెన్ చేసుకునేందుకు అనుమతి ఇచ్చారు. రాత్రి ఒంటిగంటల వరకు బార్స్ నడిపేందుకు అనుమతులు ఇచ్చారు. ఈ మేరకు రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. న్యూఇయర్ ఈవెంట్‌లకు కూడా రాత్రి ఒంటి గంట వరకు అవకాశం ఇచ్చారు. అయితే.. ప్రతి ఏడాదిలాగే ఈసారి కూడా ఎక్సైజ్, నార్కోటిక్స్, పోలీసుల ఆధ్వర్యంలో అనుమానిత ప్రాంతాలు, పబ్బులు, బార్ అండ్ రెస్టారెంట్స్‌లో తనిఖీలు నిర్వహిస్తామన్నారు హైదరాబాద్ పోలీసులు. డ్రగ్స్ టెస్టులు కూడా నిమిషాల్లో తెలిసిపోయేలా అత్యాధునిక పరికరాలు వినియోగిస్తున్నామని చెప్పారు. పబ్బుల్లో డ్రగ్స్ ఛాయలు, అనుమానితుల గుర్తింపు కోసం ప్రత్యేకంగా డాగ్ స్క్వాడ్ బృందాలతో తనిఖీ చేస్తామని తెలిపారు. డ్రంకన్ అండ్ డ్రైవ్ తనిఖీల నేపథ్యంలో మద్యం సేవించి వాహనాలు నడపకుండా డ్రైవర్‌లను ఏర్పాటు చేసుకోవాలన్నారు.

## ఫోన్ ట్యాపింగ్ కేసులో వచ్చే నెలలో కీలక పరిణామాలు



హైదరాబాద్: ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామాలు చోటుచేసుకోనున్నాయి. త్వరలోనే మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావుకు నోటీసులు జారీ చేసేందుకు సిట్ సిద్ధమవుతున్నట్టు సమాచారం. సోషల్ మీడియాలో ఇందుకు సంబంధించిన వార్త సైతం చక్కర్లు కొట్టడంతో రాష్ట్ర రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకోవడం ప్రారంభమైంది. ఫోన్ ట్యాపింగ్ అంశం రాష్ట్రంలో తీవ్ర దుమారం రేపింది. తమ ఫోన్లను ట్యాప్ చేశారని బాధితులే నేరుగా సిట్ ఎదుట చెప్పడం గమనార్హం. రాజకీయంగా, ఆర్థికంగా లొంగదీసుకోవడానికి దీనిని ఉపయోగించారని, ప్రత్యర్థుల కదలికలను కనిపెట్టడానికి, వారిని దొంగ దెబ్బతీయడానికి ఆసరాగా చేసుకున్నారని ఇప్పటికీ వాపోతున్నారు.

**ఇప్పటికే నలుగురు అరెస్ట్**

వాస్తవానికి ఫోన్‌ట్యాపింగ్‌ను ప్రత్యేక సందర్భాల్లో, ప్రత్యేక వ్యక్తులపై మాత్రమే ప్రయోగించాలి. కానీ, బీఆర్ఎస్ హయాంలో ఇలాంటివి పాటించకుండా విచ్చలవిడిగా ఫోన్లు ట్యాప్ చేశారనే ఆరోపణలున్నాయి. ఈ అంశంపై ఇప్పటికే కేసు నమోదవడంతో పాటు విచారణ సైతం కొనసాగుతున్నది. సుప్రీంకోర్టు ఈ కేసును మానిటరింగ్ చేస్తున్నది. ఈ కేసులో ఇప్పటి వరకు ఈ కేసుతో సంబంధం ఉన్న ప్రణీత్‌రావు, భుజంగరావు, రాధాకిషన్ రావు, తిరుపతన్నను అరెస్ట్ చేశారు. అనంతరం ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్ రావు తో పాటు శ్రవణ్ రావును సైతం కొన్ని మినహాయింపులతో విచారణ ఎదుర్కొంటున్నారు. ఈ కేసులో కేంద్ర హోం శాఖ సహాయమంత్రి బండి సంజయ్ నుంచి సైతం సిట్ అధికారులు స్టేట్ మెంట్ తీసుకున్నారు. ఆయన వాదనను రికార్డు చేశారు.

**తాజాగా కేసీఆర్, హరీశ్?**

తాజాగా మాజీ సీఎం కేసీఆర్, అప్పటి మంత్రి హరీశ్‌రావును సైతం విచారించేందుకు సిద్ధమవుతున్నదని, అందుకు నోటీసులు జారీ చేసేందుకు కసరత్తు చేస్తున్నదని సమాచారం. వచ్చేనెల మొదటి వారంలో వీరికి నోటీసులు జారీ అవుతాయని తెలిసింది. ఫోన్‌ట్యాపింగ్ ఎందుకు చేయించాల్సి వచ్చింది? రాజకీయ ప్రత్యర్థులను, వ్యాపారవేత్తలను ఎందుకు లక్ష్యంగా చేసుకున్నారు? తదితర విషయాలపై విచారించనున్నట్టు సమాచారం. ఇప్పటికే ఫోన్‌ట్యాపింగ్ జరిగిన సమయంలో డీజీపీగా ఉన్న మహేందర్‌రెడ్డి, అప్పటి సీఎస్ శాంతి కుమారి స్టేట్ మెంట్ రికార్డు చేశారు.

**సజ్జనార్ ఎంట్రీతో పెరిగిన స్పీడ్**

ఫోన్‌ట్యాపింగ్‌కేసు సిట్ చీఫ్‌గా హైదరాబాద్‌సీపీ సజ్జనార్ ఇటీవలే బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కేసు విచారణలో వేగం పెరిగింది. సమీక్షలు, సమావేశాలు సైతం పెరిగాయి. తాజాగా ఈ కేసులో ప్రధాన సూత్రదారులని ఆరోపణలు ఎదుర్కొంటున్న కేసీఆర్, హరీశ్‌రావుకు నోటీసులు ఇవ్వాలని నిర్ణయించినట్టుగా సమాచారం. వీరిని విచారించడం ద్వారా కీలక విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశాలున్నాయని పోలీసులు భావిస్తున్నారు.

* తన భర్త ఫోన్‌ను కేటీఆర్ ట్యాప్ చేయించారని కవిత ఆరోపణలు

ఫోన్ ట్యాపింగ్ విషయంలో కేసీఆర్ కూతురు కవిత కేటీఆర్‌పై తీవ్ర ఆరోపణలు చేశారు. సొంత బావ ఫోన్‌నే ఆయన ట్యాప్ చేయించారని పలుమార్లు మీడియా వేదికగానే వెల్లడించారు. సీఎం రేవంత్‌రెడ్డి సహా ఆయన కుటుంబ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ కీలక నాయకులతో పాటు కొందరు జడ్జీలు, మీడియా ప్రతినిధులు, వ్యాపార, పారిశ్రామికవేత్తల ఫోన్లనూ ట్యాప్ చేశారనే ఆరోపణలున్నాయి.

# గ్రూప్-1 పిటిషన్లపై కొనసాగిన వాదనలు.. విచారణ రేపటికి వాయిదా

హైదరాబాద్: టీజీపీఎస్సీ గ్రూప్1 పిటిషన్లపై తదుపరి విచారణను తెలంగాణ హైకోర్టు రేపటికి వాయిదా వేసింది. టీజీపీఎస్సీతో పాటు గ్రూప్1కు ఎంపికైన అభ్యర్థుల తరపున వాదనలు ముగిశాయి. బుధవారం ప్రతివాదుల తరపున వాదనలు కొనసాగనున్నాయి. గ్రూప్ 1పై సింగిల్ బెంచ్ తీర్పును సవాల్ చేస్తూ టీజీపీఎస్సీతో పాటు గ్రూప్ 1 ఉద్యోగానికి ఎంపికైన పలువురు అభ్యర్థులు అప్పీలు పిటిషన్లు దాఖలు చేశారు. వీటిపై సీజే ధర్మాసనం విచారణ నిర్వహిస్తోంది. మూల్యాంకనం పారదర్శకంగా జరిగిందని టీజీపీఎస్సీ, పిటిషనర్ల తరఫు న్యాయవాదులు కోర్టుకు తెలిపారు. గ్రూప్ 1 ఉద్యోగానికి ఎంపిక కాని అభ్యర్థులు అపోహలతో పిటిషన్లు వేశారని.. వాటిపై వాదనలు విన్న సింగిల్ బెంచ్ ఎలాంటి ఆధారాలు లేకుండానే ఎంపిక జాబితాను రద్దు చేసిందన్నారు. ఎన్నో ఏళ్ల తర్వాత గ్రూప్ 1 నోటిఫికేషన్ విడుదల చేశారని, ఎంతో కష్టపడి అభ్యర్థులు ఉద్యోగానికి అర్హత సాధించారని.. సింగిల్ బెంచ్ తీర్పుతో అభ్యర్థులకు తీవ్ర అన్యాయం జరిగిందని వాదించారు. గ్రూప్ 1 మెయిన్స్ మూల్యాంకనం, పరీక్షా కేంద్రాల కేటాయింపులో అవకతవకలు జరిగాయంటూ ప్రతివాదుల తరఫు న్యాయవాది సురేందర్ కోర్టుకు తెలిపారు. పరీక్షకు హాజరైన అభ్యర్థుల సంఖ్య విషయంలో టీజీపీఎస్సీ విడుదల చేసిన ప్రకటనలోనే తేడాలుండటం అనుమానాలకు తావిస్తోందన్నారు. ఈ పిటిషన్లపై బుధవారం వాదనలు కొనసాగనున్నాయి.



## అధికారులు అతి చేస్తే మూల్యం చెల్లించుకోక తప్పదు: హరీశ్‌రావు



హైదరాబాద్: ఫోన్ ట్యాపింగ్ కేసులో నోటీసుల వార్తలపై బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు స్పందించారు. రాష్ట్రంలో సిట్‌లు ఒక ప్రహసనంగా మారాయన్నారు. "కేసులు మాకు కొత్తకాదు. అసెంబ్లీ సమావేశాలు ముగిసే 3వ తేదీ సాయంత్రం నోటీసు ఇవ్వమని చెప్పారట. కొందరు అధికారులు పోస్టింగుల కోసం అక్రమ కేసులు పెట్టాలని చూస్తున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి కోసం అతిచేస్తే అధికారులు మూల్యం చెల్లించుకోక తప్పదు. ఏపీలో ఏం జరిగిందో అందరూ చూశారు కదా. రాజకీయ కక్షతో ఇబ్బంది పెడితే మీకూ అదే గతి పడుతుంది" అని హరీశ్ వ్యాఖ్యానించారు.

## ప్రజల దృష్టి మళ్లించడానికే నోటీసుల డ్రామా: కేటీఆర్



హైదరాబాద్: సీఎం రేవంత్‌రెడ్డి రెండేళ్ల పాలనలో మీడియాకు లీకులు.. ప్రత్యర్థులపై కేసులు తప్ప ప్రజలకు చేసిందేమీ లేదని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. నల్గొండ జిల్లాలో బీఆర్ఎస్ మద్దతుతో కొత్తగా గెలిచిన సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లను కేటీఆర్ సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. నదీ జలాలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి అవగాహన శూన్యమని, సాగునీటి మంత్రులది అంతులేని అజ్ఞానమని వ్యాఖ్యానించారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ, సహకారసంఘాల ఎన్నికలు నిర్వహించాలని సవాల్ విసిరారు. "రెండేళ్లుగా రోజుకో కేసు అంటూ మీడియాకు లీకులు ఇస్తున్నారు తప్ప.. ప్రజలకు ఉపయోగపడే ఒక్క మంచి పని కూడా చేయలేదు. చిట్ చాట్‌ల పేరుతో వెనుక దాక్కోవడం కాదు.. కెమెరాల ముందుకొచ్చి మాట్లాడే ధైర్యం సీఎంకి లేదు. అక్రమ కేసులకు భయపడే ప్రసక్తే లేదు. ప్రజల దృష్టి మళ్లించడానికే నోటీసుల డ్రామా? అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ఆరు గ్యారెంటీలు సహా 420 హామీలను అమలు చేయలేక రేవంత్‌రెడ్డి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారు" అని కేటీఆర్ విమర్శించారు.

భారత్‌ఆర్థిక రంగంలో కీలక పాత్ర పోషించిన

## రాజకీయ మేధావి పీవీ: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



దేశ రాజకీయాల్లో అనేక కీలక నిర్ణయాలు తీసుకున్న మహానాయకుడు పీవీ నరసింహారావు, ప్రపంచంలో భారతదేశం ఆర్థిక రంగంలో కీలక పాత్ర పోషిస్తోందంటే, ఆయన మేధస్సు గొప్పతనమని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి కొనియాడారు. మంగళవారం పీవీ 21 వర్థంతి సందర్భంగా నెక్లెస్‌రోడ్డులోని ఘాట్‌వద్ద నివాళులర్పించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ బిడ్డగా, తెలుగు ఉభయ రాష్ట్రాలకు ముఖ్యమంత్రిగా, మంత్రిగా, కేంద్రమంత్రిగా వివిధ బాధ్యతలు నిర్వహించారని తెలిపారు. ప్రధానిగా ఉన్న సమయంలో జాతీయ యువజన విధానం రూపకల్పన జరుగుతుండగా, తాను ఏర్పాటు సమావేశానికి హాజరై దేశంలో యువజన విధానం ఏ విధంగా ఉండాలన్న విషయంపై అనేక కీలక సూచనలు చేసిన మహానుభావుడని చెప్పారు. అన్ని రాజకీయ పార్టీలు భాగస్వామ్యమయ్యేలా మంచి యూత్ పాలసీ డ్రాఫ్ట్ తయారు చేయాలని సూచించారని తెలిపారు. దేశ ఆర్థిక వ్యవస్థ పూర్తిగా గాడి తప్పిన సమయంలో, దానిని తిరిగి ముందుకు తీసుకెళ్లేందుకు ప్రధానమంత్రిగా ధృఢమైన నిర్ణయాలు తీసుకున్నారని పేర్కొన్నారు. ఐక్యరాజ్యసమితిలో వివిధ దేశాల సమావేశాలకు భారతదేశం తరపున నాటి ప్రతిపక్ష నాయకుడు అటల్ బిహారీ వాజ్‌పేయిని ప్రతినిధిగా పంపించడం ఆయన రాజకీయ విశాలతకు నిదర్శనమన్నారు. అయోధ్యలో రామమందిరం నిర్మాణం జరిగిందంటే, అందులో కూడా పీవీ పాత్ర ఉందని తెలిపారు. ఆ సమయంలో ఉద్యమాన్ని అణిచివేయాలని ఆయనపై ఒత్తిడి వచ్చినప్పటికీ, రామజన్మభూమి విషయంలో ఎప్పుడూ వ్యతిరేకత చూపలేదన్నారు. చివరకు వివాదాస్పద ఘటనల సమయంలో మజ్లిస్, కాంగ్రెస్ పార్టీ విమర్శించినా ఎలాంటి వ్యతిరేకత చూపకుండా రామజన్మభూమి విషయంలో అనుకూలంగా స్పందించారని చెప్పారు. 20 సంవత్సరాల క్రితం పీవీ పరమపదించగా, ఆయన పార్థివదేహాన్ని కాంగ్రెస్ పార్టీ కార్యాలయానికి కూడా తీసుకెళ్లనీయలేదని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ నష్టాల్లో ఉన్నప్పుడు అండగా నిలబడి అన్ని విధాల సహకారం అందించిన గొప్ప నేతకు అదే కాంగ్రెస్ తీవ్ర అవమానం చేసిందని విమర్శించారు. అన్ని రాజకీయ పార్టీల నాయకులు గౌరవించే పరిపాలన దక్షుడు, మేధావి, సాహితీవేత్త, బహుభాషా కోవిదుడు అయిన పీవీ నరసింహారావు మన తెలంగాణ బిడ్డ కావడం గర్వకారణమని అన్నారు. రాజకీయ పార్టీలు, నాయకులు ఆయన రాజకీయాలను ఆదర్శంగా తీసుకోవాలని, ప్రజా సమస్యల పరిష్కారానికే రాజకీయాలు పరిమితం కావాలని, ఈతరం నాయకులు సంయమనం పాటించాలని కోరారు.

## భారత్‌ను శక్తిమంతమైన దేశంగా వాజ్‌పేయి నిలబెట్టారు

**: వెంకయ్యనాయుడు**



హైదరాబాద్: మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి జీవితం తెరిచిన పుస్తకమని.. ప్రతి పేజీ స్ఫూర్తిదాయకమని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ ఆశయ సాధన కోసం ఆయన కృషి చేశారని చెప్పారు. వాజ్‌పేయి శతజయంతి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో వెంకయ్య మాట్లాడారు. "భాజపాకు బలమైన పునాది వేసిన వ్యక్తుల్లో వాజ్‌పేయి ముందు వరుసలో ఉంటారు. ఆయన్ను శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ శిష్యుడిగా ఎంచుకున్నారు. వాజ్‌పేయి అంటే సుపరిపాలన. యువతకు ఆదర్శం. ఆయన చూపిన మార్గంలో నడుస్తున్నామా? లేదా? అనేది ప్రతి కార్యకర్త ఆలోచించుకోవాలి. నైతిక పాలన, సామాజిక బాధ్యత, రాజ్యాంగం పట్ల అంకితభావంతో పనిచేయాలి. రాజ్యాంగం పుస్తకాన్ని పట్టుకుని తిరిగితే అలా పనిచేస్తున్నట్లు కాదు. నేతలకు తప్పుడు భాష మాట్లాడటం అలవాటైపోయింది. వారు శత్రువులు కాదు.. ప్రత్యర్థులు మాత్రమే. నేను పదవీ విరమణ మాత్రమే చేశా.. పెదవి విరమణ చేయలేదు. వాజ్‌పేయి భారత్‌ను శక్తిమంతమైన దేశంగా ప్రపంచం ముందు నిలబెట్టారు. దేశ రక్షణ విషయంలో కఠినంగా ఉన్నారు. పీవీ నరసింహారావు సంస్కరణలు తీసుకొస్తే.. వాటిని ఆచరణలో పెట్టిన వ్యక్తి వాజ్‌పేయి. తన వల్లే యుద్ధాలు ఆగిపోతున్నాయని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చెప్పుకోవడం సరికాదు. రాజనీతి, దౌత్యనీతి ప్రదర్శించే వ్యక్తి ప్రధాని మోదీ. ఆపరేషన్ సిందూర్‌ను విజయవంతం చేసిన ఆర్మీ, శాస్త్రవేత్తలకు హ్యాట్సాఫ్. ప్రభుత్వాలు ఉచితాలు ఇవ్వడం సరికాదు. ఉచిత బస్సు ఇవ్వాలని మహిళలు అడిగారా? నాణ్యమైన విద్య, వైద్యం మాత్రమే ఉచితంగా ఇవ్వాలి. ఉచితాలకు స్వస్తి పలికి.. కష్టపడే వారికి చేయూతనివ్వాలి. ఓటు బ్యాంకు రాజకీయాల కోసం మైనార్టీలను ప్రోత్సహించకూడదు" అని వెంకయ్యనాయుడు అన్నారు.

## ప్రజాస్వామ్య దేశానికి పరిపాలన దక్షకుడు పీవీ: స్పీకర్ గడ్డం ప్రసాద్



ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య దేశానికి పరిపాలన దక్షకుడిగా పీవీ నరసింహ రావు ఖ్యాతి పొందారని, దేశానికి ప్రధాని అయిన తెలంగాణ ముద్దు బిడ్డ పీవీ అని రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. ఆయన ఆర్థికవేత్త, సంస్కరణలకర్తగా చరిత్రలో నిలిచారని గడ్డం ప్రసాద్ కుమార్ వివరించారు. దేశ మాజీ ప్రధాని పీవీ నరసింహ రావు వర్ధంతి సందర్భంగా మంగళవారం శాసనసభ భవనం లాబీ హాల్ లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ లు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ ఇవాళ దేశం ఆర్థిక సమస్యలను తట్టుకుని నిలబడుతోంది అంటే దానికి కారణం పీవీ అని, ఆయన చూపించిన బాటలో మనమందరం పయనించాలని ఆయన సూచించారు. గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ పీవీ నరసింహ రావు దేశానికి ఎనలేని సేవ చేశారని, ప్రధానిగా ఆయన ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చి ఆర్థికవేత్తగా దేశాన్ని ముందుకు నడిపించారని అన్నారు. పీవీ గొప్ప మేధావి, బహుభాషా కోవిదుడని, 14 భాషల్లో అనర్గళంగా మాట్లాడేవారన్నారు. పీవీ నరసింహా రావు నిజాయితీకి, నిరాడంబరతకు నిలువుటద్దమని గుత్తా సుఖేందర్ రెడ్డి కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీలు వాణీదేవి, బోగరపు దయానంద్, లెజిస్లేచర్ సెక్రటరీ వి. నరసింహా చార్యులు, పీవీ కుటుంబ సభ్యులు, సీఎల్పీ సెక్రెటరీ శ్రీకాంత్ తదితర అధికారులు పాల్గొన్నారు.




## అలర్ట్.. సమగ్ర శిక్ష సిబ్బందికి ఇక 'ఫేషియల్' హాజరు.. ఉత్తర్వులు జారీ చేసిన విద్యాశాఖ

రాష్ట్రంలోని పాఠశాల విద్యాశాఖ, సమగ్ర శిక్ష కార్యాలయాల్లో పారదర్శకత పెంచే దిశగా ప్రభుత్వం మరో నిర్ణయం తీసుకుంది. సమగ్ర శిక్ష అభియాన్ పరిధిలో పనిచేస్తున్న బోధనేతర సిబ్బంది, వివిధ కార్యాలయాల అధికారుల కోసం ఫేషియల్ రికగ్నిషన్ అటెండెన్స్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ అమలు చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు మంగళవారం పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ విధానాన్ని పకడ్బందీగా అమలు చేసేందుకు గాను, సంబంధిత కార్యాలయాల్లో పనిచేస్తున్న సిబ్బంది పూర్తి వివరాలను డిసెంబర్ 28 లోపు సమర్పించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ వివరాలను అటు సాఫ్ట్ కాపీ రూపంలోనూ, ఇటు హార్డ్ కాపీ రూపంలోనూ పాఠశాల విద్యాశాఖ కార్యాలయానికి పంపాలని పేర్కొంది. ఇప్పటికే పాఠశాలల్లో ఉపాధ్యాయులకు, విద్యార్థులకు ఫేషియల్ అటెండెన్స్ అమలు చేస్తున్న ప్రభుత్వం, ఇప్పుడు క్షేత్రస్థాయి, పరిపాలనా యంత్రాంగంలో కూడా దీనిని ప్రవేశపెడుతోంది. దీనివల్ల కార్యాలయాల్లో సిబ్బంది సమయపాలన మెరుగుపడుతుందని, విధుల్లో జాప్యం తగ్గుతుందని అధికారులు భావిస్తున్నారు. ఈ కొత్త హాజరు విధానం హైదరాబాద్, వరంగల్ ఆర్జేడీఎస్ఈ కార్యాలయాలు, అన్ని డైట్ కాలేజీలు, డీఈఓ కార్యాలయాలు, ఎంఈఓ కార్యాలయాల సిబ్బందికి వర్తించనుంది. వీరితో పాటు రాష్ట్ర వ్యాప్తంగా పనిచేస్తున్న సమగ్ర శిక్ష సిబ్బంది అందరూ ఈ విధానం కిందకు రానున్నారు.

## న్యూఇయర్ వేడుకల ఎఫెక్ట్: అప్రమత్తమైన పోలీస్ శాఖ




రాష్ట్రంలో నూతన సంవత్సరం వేడుకల సందర్భంగా మద్యం అమ్మకాలకు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కమిషనర్ సి. హరికిరణ్ ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేశారు. డిసెంబరు 31 వ తేదీన బార్లకు, క్లబ్‌లకు, ఈవెంట్ పర్మిషన్ తీసుకున్న వాళ్లకు, టూరిజం ప్రాంతాల్లో రాత్రి 1 గంటల వరకు మద్యం సేవించడానికి అనుమతి ఉంటుందన్నారు. ఏ 4 షాపులు (మద్యం షాపులకు) రాత్రి 12 గంటల వరకు మద్యం అమ్మకాలు జరుపుకోవచ్చునని పేర్కొన్నారు. కొత్త ఏడాది వేడుకలకు మద్యం అమ్మకాలపై తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక జీవో ఇవ్వడంతో పాటు ఈ నెల 30, 31న ప్రత్యేక తనిఖీలుంటాయని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖ వెల్లడించింది. ఇప్పటికే చాలా చోట్ల యువతను పాత ఏడాదికి వీడ్కోలు , నూతన సంవత్సరానికి స్వాగతం పలికేందుకు ఈవెంట్లు సిద్ధమైయాయి. నగర శివారు ప్రాంతంలో పెద్దమొత్తంలో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిసింది. ఈఏడాది కోట్ల రూపాయల దందా సాగుతుందని అబ్కారీ శాఖ అంచనా వేస్తుంది. ఇష్టానుసారంగా మద్యం అమ్మకాలు చేయకుండా ముందస్తు జాగ్రత్తలో భాగంగా తగిన ఏర్పాటు చేస్తోంది. ఎక్కడ గొడవలు జరగకుండా పోలీసుల శాఖ అప్రమత్తమైంది. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిస్తోంది. రోడ్లపై ద్విచక్ర వాహనాలతో హంగామా చేస్తే కేసు నమోదు తప్పదని పేర్కొంది.

## ఉపసర్పంచ్ చెక్ పవర్ రద్దు కాలేదు : మంత్రి సీతక్క క్లారిటీ



ఉప సర్పంచ్ ల చెక్ పవర్ రద్దుపై కొనసాగుతున్న ప్రచారానికి పంచాయితీ రాజ్ శాఖ మంత్రి సీతక్క ముగింపు పలికారు. ఉప సర్పంచ్ ల చెక్ పవర్ రద్దు అంటూ వస్తున్న వార్తలు పూర్తిగా అవాస్తవం అన్నారు. ప్రభుత్వం అలాంటి నిర్ణయం ఏదీ తీసుకోలేదని సీతక్క స్పష్టం చేసారు. ఉప సర్పంచ్ ల అధికారాల విషయంలో జరుగుతున్నా అసత్య ప్రచారాన్ని ఎవరూ నమ్మవద్దని కోరారు. సోషల్ మీడియాలో లేదా ఇతర మీడియా వేదికల్లో ఇలాంటి తప్పుడు వార్తలను ప్రచారం చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పంచాయితీరాజ్ వ్యవస్థ బలోపేతానికి ప్రభుత్వం కట్టుబడి ఉన్న నేపథ్యంలో ఇలాంటి నిర్ణయానికి తావులేదని సీతక్క క్లారిటీ ఇచ్చారు. కాగా సీతక్క ప్రకటనపై ఉప సర్పంచులు ఊపిరి పీల్చుకున్నారు.

# ఉన్నావ్ అత్యాచార ఘటన నిందితుడి శిక్ష నిలిపివేత

ఉన్నావ్ అత్యాచార ఘటన కేసులో ఢిల్లీ హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసులో నిందితుడిగా తేలి, జీవిత ఖైదు అనుభవిస్తున్న భాజపా బహిష్కృత నేత కుల్దీప్ సింగ్ సెంగర్ శిక్షను నిలిపివేస్తున్నట్లు వెల్లడించింది. ఉన్నావ్ అత్యాచార కేసులో తనను దోషిగా నిర్ధారిస్తూ.. 2019లో ట్రయల్ కోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ సెంగర్ దాఖలు చేసిన అప్పీల్ పెండింగ్‌లో ఉండటంతో అతడి శిక్షను సస్పెండ్ చేస్తున్నట్లు తెలిపింది. జస్టిస్ సుబ్రమణియం ప్రసాద్, జస్టిస్ హరీష్ వైద్యనాథన్ శంకర్‌లతో కూడిన ధర్మాసనం సెంగర్‌ను బెయిల్‌పై విడుదల చేసింది. ఇందుకుగానూ రూ. 15 లక్షల వ్యక్తిగత బాండ్ సమర్పించాలని ఆదేశించింది. నిందితుడు బాధితురాలి ఇంటి పరిధిలోకి వెళ్లకూడదని..ప్రత్యక్షంగా, పరోక్షంగా బెదిరింపులకు పాల్పడవద్దని పేర్కొంది. ఈ షరతులను ఉల్లంఘిస్తే బెయిల్ రద్దవుతుందని తెలిపింది. పెండింగ్‌లో ఉన్న పిటిషన్ విచారణలో అతడు దోషిగా తేలితే పూర్తి శిక్షను అనుభవించాల్సి ఉంటుందని తెలిపింది. 2017లో కుల్దీప్ సింగ్ సెంగర్ ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఉన్నావ్ ప్రాంతానికి చెందిన ఓ మైనర్ బాలికను కిడ్నాప్ చేసి, అత్యాచారానికి పాల్పడ్డాడు. ఆగస్టు 1, 2019న సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు అత్యాచారం కేసు, సంబంధిత ఇతర కేసులను ఉత్తరప్రదేశ్‌లోని ట్రయల్ కోర్టు నుంచి ఢిల్లీకి బదిలీ చేశారు.






## జేఈఈ, నీట్ పరీక్షల్లో
# 'ఫేషియల్ రికగ్నిషన్'.. ఎన్టీఏ యోచన!

ఢిల్లీ: జేఈఈ, నీట్ వంటి ప్రతిష్ఠాత్మక జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ సిద్ధమవుతోంది. ఇందులో భాగంగా 2026 విద్యాసంవత్సరం నుంచి అత్యాధునిక ఫేషియల్ రికగ్నిషన్ వెరిఫికేషన్ విధానాన్ని ప్రవేశపెట్టాలని యోచిస్తోంది. పరీక్షా కేంద్రాల్లో ఒకరికి బదులుగా మరొకరు పరీక్ష రాయడంలాంటి అక్రమాలకు అడ్డుకట్ట వేయడమే లక్ష్యంగా అభ్యర్థుల గుర్తింపును ధ్రువీకరించేందుకు వీలుగా ఈ తరహా విధానానికి శ్రీకారం చుట్టనున్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. పరీక్షలకు దరఖాస్తు చేసుకొనే సమయంలోనే అభ్యర్థులు తమ లైవ్ ఫొటోలను క్యాప్చర్ చేసే ఆప్షన్‌ను కూడా అందుబాటులోకి తేనున్నట్లు తెలుస్తోంది. వెబ్‌క్యామ్ లేదా మొబైల్ ఫోన్ ద్వారా రియల్ టైంలో ఫొటోలు అప్‌లోడ్ చేయడం వల్ల ఒకరికి బదులు మరొకరు పరీక్ష రాసే అవకాశాన్ని అరికట్టవచ్చని అధికారులు భావిస్తున్నారు. మరోవైపు, ఆధార్ ఆధారిత ఫేస్ అథంటికేషన్‌ను గతేడాది నీట్ పరీక్షల సమయంలో ఢిల్లీలో ఎంపిక చేసిన కొన్ని పరీక్ష కేంద్రాల్లో నిర్వహించారు. దీంతో వచ్చే ఏడాది నుంచి దీన్ని పూర్తిస్థాయిలో అమలు చేసేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. గతంలో పేపర్ లీకేజీ ఆరోపణలు, పరీక్షల్లో అక్రమాలపై కేంద్ర ప్రభుత్వం నియమించిన రాధాకృష్ణన్ కమిటీ చేసిన సిఫారసుల మేరకు ఈ తరహా సంస్కరణలు తీసుకొచ్చేందుకు ఎన్టీఏ సిద్ధమవుతున్నట్లు సమాచారం.

## రూ.7 కోట్లతో థార్‌లు కొని..
# రూ.5 కోట్లతో మార్పులు : అటవీశాఖపై చర్యలు



థార్ వాహనాల కొనుగోలు విషయంలో ఒడిశా అటవీశాఖ తీరుపై వివాదం తలెత్తడంతో అక్కడి ప్రభుత్వం అటవీశాఖ అధికారులపై చర్యలకు ఆదేశించింది. 202425 ఆర్థిక సంవత్సరంలో ఒడిశా అటవీశాఖ రూ.7 కోట్లు వెచ్చించి థార్ వాహనాలను కొనుగోలు చేసింది. అనంతరం వాటిలో పలు మార్పుల కోసం రూ.5 కోట్లు ఖర్చు చేసినట్లు రికార్డుల్లో వెల్లడించింది. అయితే కేవలం వాహనాలకు చేసిన ఖర్చే రూ.12 కోట్లకు చేరుకోవడంతో తీవ్రస్థాయిలో విమర్శలు వెల్లువెత్తాయి. దీంతో వాహనాల కొనుగోలు, మార్పులకు అయిన ఖర్చులపై ఆడిట్ నిర్వహించాలని పర్యావరణ శాఖ మంత్రి గణేష్ రామ్ సింగ్ ఉన్నతాధికారులను ఆదేశించారు. వాహనాల్లో మార్పులు అవసరమా అనే కోణంలోను దర్యాప్తు జరుగుతోందన్నారు. ఆడిట్ సమయంలో ఏదైనా చట్టవిరుద్ధమైన, అనుమానాస్పద కార్యకలాపాలు బయటపడితే అందుకు కారకులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అయితే మారుమూల అటవీ ప్రాంతాల్లోకి వెంటనే చేరుకునేందుకు వీలుగా థార్‌లను కొనుగోలు చేసినట్లు అటవీ అధికారులు వివరించారు. వన్యప్రాణులను రక్షించడం, వేట, కలప అక్రమ రవాణా వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలను అరికట్టడం కోసం వీటిని వినియోగిస్తున్నట్లు తెలిపారు. దట్టమైన అటవీ ప్రాంతాల్లోనూ తిరగడానికి వీలుగా ఉండేందుకు క్షేత్రస్థాయి అవసరాలకు అనుగుణంగా వాహనాలకు అదనపు లైట్లు, కెమెరాలు, సైరన్లు, ప్రత్యేక టైర్లు, ఇతర పరికరాలను అమర్చినట్లు అధికారులు పేర్కొన్నారు.

# మూకదాడి ఘటన.. ఢిల్లీలో బంగ్లా హైకమిషన్ వద్ద ఉద్రిక్తత

దేశ రాజధాని ఢిల్లీలోని బంగ్లాదేశ్ హైకమిషన్ వద్ద ఉద్రిక్తత చోటుచేసుకుంది. బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులను ఖండిస్తూ కార్యాలయం వద్దకు వీహెచ్‌పీ కార్యకర్తలు భారీగా చేరుకొని నిరసన చేపట్టారు. బారికేడ్లు నెట్టుకొని లోపలికి వెళ్లేందుకు యత్నించారు. దీంతో ఆ ప్రాంతంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు అప్రమత్తమయ్యారు. కార్యకర్తలు ఎవరూ లోపలికి వెళ్లకుండా నిలువరిస్తున్నారు. బజరంగ్‌దళ్ కార్యకర్తలు కూడా ప్లకార్డులు, బ్యానర్లు ప్రదర్శిస్తూ




ఎంబసీ వద్ద నినాదాలు చేశారు. ఇలాంటి ఘటనలను ముందుగానే అంచనా వేయడంతో పోలీసులతో పాటు పారామిలటరీని రంగంలోకి దించారు. మూడు అంచెల్లో బారికేడ్లను ఏర్పాటుచేశారు. మరో మతానికి వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేశారన్న ఆరోపణలతో బంగ్లాదేశ్‌లోని మయమన్‌సింగ్ జిల్లాలో 25 ఏళ్ల దీపూ చంద్ర దాస్‌పై గతవారం మూక దాడి జరిగింది. కొందరు దుండగులు అతడిని తీవ్రంగా కొట్టి చెట్టుకు వేలాడదీసి ఉరితీశారు. మరికొందరు ఆ మృతదేహానికి నిప్పు అంటించడంతో ఆ రహదారిలో ట్రాఫిక్ నిలిచిపోయింది. ఈ ఘటనను ప్రపంచ దేశాలు ఖండిస్తున్నాయి. మైనార్టీలను రక్షించేందుకు, చట్టబద్ధమైన పాలనను పునరుద్ధరించేందుకు బంగ్లా అధికారులు చర్యలు తీసుకోవాలని అమెరికా చట్టసభ సభ్యులు పిలుపునిచ్చారు.

**యూనస్ విఫలమయ్యారు..**

చిట్టగాంగ్‌లోని భారత హైకమిషన్‌పై దాడి, రాజధాని ఢాకాలో హింసాత్మక నిరసనలు 'మోబోక్రసీ (మూక వ్యవస్థలు)కి నిదర్శనమని బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ నేత ఆమిర్ ఖుస్రు మహమ్మద్ అన్నారు. ఈ మోబోక్రసీని నియంత్రించడంలో బంగ్లా తాత్కాలిక సారథి మహమ్మద్ యూనస్ విఫలమయ్యారని విమర్శించారు. కాగా.. వచ్చే ఏడాది ఫిబ్రవరి 12న బంగ్లాలో ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలోనే మరోసారి హింసాత్మక ఘటనలు చోటుచేసుకుంటున్నాయి.



## పీఎం అభ్యర్థిగా ప్రియాంక గాంధీ..?
# రాబర్ట్ వాద్రా ఆసక్తికర వ్యాఖ్యలు

కాంగ్రెస్ పార్టీ తరఫున ప్రధాని అభ్యర్థిగా ప్రియాంకా గాంధీని ఎంపిక చేయాలని ఆ పార్టీ ఎంపీ ఇమ్రాన్ మసూద్ చేసిన వ్యాఖ్యలపై ఆమె భర్త రాబర్ట్ వాద్రా స్పందించారు. పార్టీ కార్యకర్తలంతా తమ సతీమణి ప్రధాని కావాలని కోరుకుంటున్నారని.. చాలా చోట్ల నుంచి ఇలాంటి డిమాండ్లు వస్తూనే ఉన్నాయన్నారు. రాజకీయాల్లో ప్రియాంక ముందడుగు వేయాలని.. తాను కూడా రాజకీయాల్లోకి రావాలని అందరూ కోరుకుంటున్నారని పేర్కొన్నారు. కానీ ప్రస్తుతం ప్రియాంక దృష్టి ప్రజా సమస్యలపైనే ఉందన్నారు. ఇటీవల కాంగ్రెస్ నేత ఇమ్రాన్ మసూద్ మీడియాతో మాట్లాడుతూ.. ప్రియాంకా గాంధీని ప్రధాన మంత్రిగా ఎన్నుకుంటే ఆమె తన నానమ్మ, మాజీ ప్రధాని ఇందిరా గాంధీ లాగా మంచి ప్రజాదరణ సొంతం చేసుకుంటారని అన్నారు. శత్రు దేశాలకు తగిన బుద్ధి చెబుతారన్నారు. రాహుల్ గాంధీ గురించి మీడియా ప్రశ్నించగా.. వారిరువురు కలిసి పని చేస్తారని చెప్పుకొచ్చారు.

# దేశ ప్రతిష్ఠను దెబ్బతీయడం రాహుల్‌కు అలవాటుగా మారిపోయింది

: **భాజపా**





కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ బెర్లిన్‌లో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు చేయడాన్ని భాజపా తప్పుపట్టింది. విదేశాల్లో భారత ప్రతిష్ఠను దెబ్బతీసేలా వ్యవహరించడం ప్రతిపక్ష నేతకు అలవాటుగా మారిపోయిందని భాజపా ప్రతినిధి షెహజాద్ పూనావాలా మండిపడ్డారు. రాహుల్ విదేశీ పర్యటనలో లేరని భారత్‌ను అవమానించే పనిలో ఉన్నారని విమర్శించారు. భారత్‌ను విమర్శిస్తూ.. చైనాకు మద్దతివ్వడం వారికి అలవాటేనన్నారు. విదేశాల్లో భారత వ్యతిరేక శక్తులతో చేతులు కలిపి, దేశానికి వ్యతిరేకంగా కుట్రలు పన్నుతున్నారని దుయ్యబట్టారు. మరో భాజపా ప్రతినిధి శోభా కరంద్లాజే మాట్లాడుతూ.. రాహుల్ ప్రతిపక్ష నాయకుడు కాదని.. దేశ వ్యతిరేక నాయకుడని అన్నారు. ఓ పార్టీకి అగ్ర నేతగా కొనసాగుతున్నప్పటికీ చిన్నపిల్లాడిలా ప్రవర్తిస్తున్నారని మండిపడ్డారు. జర్మనీ పర్యటనలో భాగంగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. భారత రాజ్యాంగాన్ని రద్దు చేసే దిశగా భాజపా ప్రభుత్వం ఆలోచిస్తోందన్నారు. ఈడీ, సీబీఐ, ఎన్నికల కమిషన్లను పావులుగా వాడుకొని కేంద్ర ప్రభుత్వం ఓట్ల చోరీ కి పాల్పడుతోందని ఆరోపించారు. అందువల్లే ఎన్డీఏ నేతలు ఎన్ని అక్రమాలు చేస్తున్నా దర్యాప్తు సంస్థలు తమకు ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నాయన్నారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించే ప్రతిపక్ష నేతలపై మాత్రం కేసులు పెడుతూ బెదిరింపులకు పాల్పడుతున్నాయన్నారు. వివిధ రాష్ట్రాల్లోని ఎన్నికల్లో ఓటు చోరీ జరిగినట్లు తాను ఎన్ని రుజువులు చూపిస్తున్నప్పటికీ ఎన్నికల కమిషన్ ఎటువంటి చర్యలు తీసుకోవట్లేదని విమర్శించారు. భారత్‌లో ప్రజాస్వామ్యంపై జరుగుతున్న ఈ దాడిని ఎదుర్కోవడానికి ప్రతిపక్షాలు ఓ కవచాన్ని రూపొందిస్తున్నాయన్నారు.

## బిహార్‌లోని నీతీశ్ పాలనపై
# శశిథరూర్ ప్రశంసలు..!

కేంద్రంలోని భాజపాపై ప్రశంసలు కురిపిస్తూ.. ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత శశిథరూర్ నిత్యం వార్తల్లో నిలుస్తుంటారు. తాజాగా బిహార్‌లోని ఎన్డీయే కూటమి పాలనను అభినందించారు. రాష్ట్రంలో మౌలిక వసతుల కల్పనపై ప్రభుత్వం ఎక్కువగా దృష్టి పెట్టిందన్నారు. ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు థరూర్ బిహార్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా ఓ వార్తా సంస్థతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఇంతకుముందు తాను విన్న దానికంటే బిహార్‌లో మౌలిక సదుపాయాలు మెరుగ్గా ఉన్నాయన్నారు. రోడ్లు బాగున్నాయన్నారు. గతంలో ఎప్పుడూ లేనివిధంగా అర్ధరాత్రి దాటిన తర్వాత కూడా ప్రజలు వీధుల్లోకి వస్తున్నారని.. శాంతి, భద్రతలు మెరుగుపడ్డాయన్నారు. విద్యుత్, నీటి సదుపాయాలు కూడా సరిగ్గా ఉన్నాయని థరూర్ అన్నారు. ఇటీవల సంవత్సరాల్లో చాలా మంచి పనులు జరిగాయన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్ గురించి ప్రశ్న అడగ్గా.. తనను ఇక్కడి రాజకీయాల్లోకి లాగొద్దని




వ్యాఖ్యానించారు. ఇక్కడ జరిగిన అభివృద్ధి చూసి సంతోషంగా ఉందన్నారు. థరూర్ వ్యాఖ్యలపై కాంగ్రెస్ నుంచి ఇప్పటివరకు ఎలాంటి స్పందన రాలేదు. ఇక, కాంగ్రెస్ సీనియర్ నేత అయిన థరూర్.. ఇటీవల ప్రధాని మోదీని, అధికార భాజపాపై ప్రశంసలు కురిపిస్తూ పలుమార్లు వ్యాఖ్యలు చేశారు. దీనిపై సొంత పార్టీ నేతల నుంచి తీవ్ర విమర్శలు వెలువడ్డాయి.

# లండన్‌లో గ్రెటా థన్‌బర్గ్ అరెస్ట్

పర్యావరణ ఉద్యమకారిణి గ్రెటా థన్‌బర్గ్ లండన్‌లో అరెస్టయ్యారు. పాలస్తీనా అనుకూలవాదులకు మద్దతుగా చేపట్టిన నిరసనల్లో పాల్గొన్న ఆమెను అక్కడి భద్రతా సిబ్బంది అదుపులోకి తీసుకున్నారు. 'పాలస్తీన్ యాక్షన్' అనే సంస్థ ప్లకార్డును పట్టుకొని గ్రెటా నిరసనకు దిగిన క్రమంలో ఈ పరిణామం చోటుచేసుకుంది. అయితే, ఆ సంస్థను బ్రిటిష్ ప్రభుత్వం ఈ ఏడాది ప్రారంభంలో ఉగ్రవాద సంస్థగా ప్రకటిస్తూ నిషేధం విధించింది. లండన్‌లో గతంలో వివిధ నిరసన కార్యక్రమాల్లో పాల్గొన్నారన్న అభియోగాలపై పలువురు పాలస్తీనా మద్దతుదారులను స్థానిక పోలీసులు అరెస్టు చేశారు. వీరికి బెయిల్ కూడా లభించలేదని సమాచారం. ఈ చర్యలను వ్యతిరేకిస్తూ పాలస్తీన్ యాక్షన్ సంస్థకు చెందిన ఎనిమిది మంది




సభ్యులు లండన్ ప్రధాన వీధుల్లో నిరవధిక నిరసన చేపట్టారు. ఈ క్రమంలో ఇజ్రాయెల్ రక్షణశాఖతో సంబంధమున్న ఓ బీమా సంస్థ సమీపంలో నిరసనకు దిగారు. కార్యాలయం ముందు ఎరుపు రంగు పెయింట్ వేశారు. దీంతో రంగంలోకి దిగిన లండన్ పోలీసులు తొలుత ఓ మహిళ సహా ఇద్దరిని అరెస్టు చేశారు. ఆ తర్వాత సంబంధిత సంస్థకు మద్దతుగా నిలిచారన్న ఆరోపణలతో గ్రెటాను సైతం అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది.

# లాభనష్టాల మధ్య ఊగిసలాట...

**మిశ్రమంగా ముగిసిన మార్కెట్లు**

**స్వల్ప నష్టాల్లో సెన్సెక్స్, లాభాల్లో నిఫ్టీ**

**ఐటీ షేర్లలో అమ్మకాల ఒత్తిడి ప్రభావం**

**ఆర్థిక, ఎఫ్‌ఎంసీజీ రంగాల షేర్లు మార్కెట్‌కు మద్దతు**

**స్థిరంగా ముగిసిన రూపాయి విలువ**



**ముంబై:** దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం మిశ్రమంగా ముగిశాయి. ఐటీ షేర్లలో అమ్మకాల ఒత్తిడి సూచీలను కిందకు లాగగా, ఆర్థిక, ఎఫ్‌ఎంసీజీ, మెటల్ రంగాల షేర్లలో కొనుగోళ్ల మద్దతు నష్టాలను పరిమితం చేసింది. ఫలితంగా, రెండు రోజుల లాభాలకు బ్రేక్ వేస్తూ సెన్సెక్స్ స్వల్పంగా నష్టపోగా, నిఫ్టీ వరుసగా మూడో రోజూ లాభాలను నమోదు చేసింది. ట్రేడింగ్ ముగిసే సమయానికి, బీఎస్ఈ సెన్సెక్స్ 0.05 శాతం స్వల్పంగా తగ్గి 85,524.84 వద్ద స్థిరపడింది. మరోవైపు, ఎన్ఎస్ఈ నిఫ్టీ 4.75 పాయింట్లు లాభపడి 26,177.15 వద్ద ముగిసింది. నిఫ్టీ వీక్లీ డెరివేటివ్స్ ఎక్స్‌పైరీ కారణంగా కూడా ఇన్వెస్టర్లు అప్రమత్తంగా వ్యవహరించారు.

సెన్సెక్స్ సూచీలో ఐటీసీ, అల్ట్రాటెక్ సిమెంట్, టాటా స్టీల్ షేర్లు ప్రధాన లాభాల్లో నిలిచాయి. ఇన్ఫోసిస్, టెక్ మహీంద్రా, భారతీ ఎయిర్‌టెల్ షేర్లు నష్టపోయాయి. నిఫ్టీలో కోల్ ఇండియా, శ్రీరామ్ ఫైనాన్స్, ఐటీసీ టాప్ గెయినర్లుగా ఉండగా, ఇన్ఫోసిస్, భారతీ ఎయిర్‌టెల్ నష్టాలను చవిచూశాయి.

విస్తృత మార్కెట్లలో మిశ్రమ ధోరణి కనిపించింది. నిఫ్టీ స్మాల్‌క్యాప్ 100 ఇండెక్స్ 0.37 శాతం పెరగ్గా, నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 దాదాపు యథాతథంగా ముగిసింది. రంగాలవారీగా చూస్తే, ఐటీ ఇండెక్స్ 0.80 శాతంతో అత్యధికంగా నష్టపోగా, మీడియా ఇండెక్స్ 0.84 శాతంతో టాప్ గెయినర్‌గా నిలిచింది.

టెక్నికల్‌గా నిఫ్టీకి 26,000-26,100 స్థాయి కీలక మద్దతు జోన్‌గా ఉందని, ఈ స్థాయి పైన నిలదొక్కుకుంటే మార్కెట్ సానుకూలంగా ఉండొచ్చని విశ్లేషకులు అభిప్రాయపడ్డారు. మరోవైపు, ఇయర్-ఎండ్ రీబ్యాలెన్సింగ్ కారణంగా డాలర్‌తో రూపాయి మారకం విలువ వరుసగా రెండో రోజూ ఫ్లాట్‌గా ముగిసింది.

# టాటా ఈవీల జోరు...

**భారత రోడ్లపై 2.5 లక్షల ఎలక్ట్రిక్ కార్లు**

**భారత్‌లో 2.5 లక్షల టాటా ఎలక్ట్రిక్ కార్ల మైలురాయి**

**దేశ ఈవీ మార్కెట్‌లో 66 శాతం వాటాతో టాటా ఆధిపత్యం**

**నెక్సాన్.ఈవీ లక్ష అమ్మకాల రికార్డు సాధించిన తొలి ఈవీ**

**దేశవ్యాప్తంగా 2 లక్షలకు పైగా చార్జింగ్ పాయింట్ల ఏర్పాటు**




**న్యూఢిల్లీ:** భారత్‌లో ఎలక్ట్రిక్ వాహనాల ప్రయాణంలో టాటా మోటార్స్ మరో చారిత్రక ఘట్టాన్ని నమోదు చేసింది. మంగళవారం టాటా మోటార్స్ అధికారికంగా ప్రకటించిన వివరాల ప్రకారం భారత రోడ్లపై 2.5 లక్షలకు పైగా టాటా ఎలక్ట్రిక్ కార్లు పరుగులు తీస్తున్నాయి. ఇది భారత ఎలక్ట్రిక్ ప్యాసింజర్ వాహన మార్కెట్లో టాటా మోటార్స్ ఆధిపత్యాన్ని తెలియజేస్తోంది. ఒకప్పుడు ఎలక్ట్రిక్ వాహనాలు కేవలం ప్రయోగాత్మకంగా భావించబడితే, ఇప్పుడు అవి సాధారణ వినియోగదారుల మొదటి ఎంపికగా మారుతున్నాయి. ఈ మార్పులో టాటా మోటార్స్ కీలక పాత్ర పోషించింది. 2020లో దేశంలోనే తొలి మాస్ మార్కెట్ ఎలక్ట్రిక్ కారుగా నెక్సాన్.ఈవీను ప్రవేశపెట్టిన టాటా, ఆ తర్వాత ఎలక్ట్రిక్ విభాగంలో వేగంగా విస్తరించింది. నెక్సాన్.ఈవీ దేశంలో లక్షకు పైగా అమ్మకాలు సాధించిన తొలి ఎలక్ట్రిక్ కారుగా చరిత్ర సృష్టించింది. ప్రస్తుతం భారత్‌లో అమ్ముడయ్యే ఎలక్ట్రిక్ ప్యాసింజర్ వాహనాల్లో సుమారు 66 శాతం వాటా టాటా మోటార్స్‌దే. అంటే రోడ్లపై కనిపించే ప్రతి మూడు ఈవీల్లో రెండు టాటా వాహనాలే. టియాగో.ఈవీ, పంచ్.ఈవీ, నెక్సాన్.ఈవీ, కర్వ్.ఈవీ, హారియర్.ఈవీ వంటి విభిన్న మోడళ్లతో అన్ని ధరల శ్రేణుల్లో వినియోగదారులకు టాటా అందిస్తోంది. ట్రావెల్ ఏజెన్సీల కోసం ఎక్స్‌ప్రెస్.ఈటీవీ ను కూడా అందుబాటులోకి తెచ్చింది. ఈ సందర్భంగా టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికల్స్ ఎండీ అండ్ సీఈఓ శైలేశ్ చంద్ర మాట్లాడుతూ.. "ఇది కేవలం కార్ల అమ్మకాల్లో విజయం కాదు. భారతదేశంలో స్వచ్ఛమైన మొబిలిటీ వైపు జరిగిన మార్పుకు నిదర్శనం" అని అన్నారు. ప్రభుత్వ విధానాలు, చార్జింగ్ మౌలిక వసతులు, వినియోగదారుల నమ్మకం కలిసి ఈ విజయంలో భాగమని తెలిపారు. చార్జింగ్ సౌకర్యాల పరంగా కూడా టాటా ముందంజలో ఉంది. దేశవ్యాప్తంగా 2 లక్షలకు పైగా చార్జింగ్ పాయింట్లకు టాటా యాక్సెస్ కల్పిస్తోంది. ఇప్పటికే ప్రధాన రహదారులు, నగరాల్లో 100 మెగా ఫాస్ట్ ఛార్జింగ్ హబ్‌లు పనిచేస్తున్నాయి.

# అమెరికా వీడితే రూ. 2.7 లక్షలు...

**అక్రమ వలసదారులకు ట్రంప్ సర్కార్ బంపర్ ఆఫర్!**

**అమెరికా వీడే అక్రమ వలసదారులకు 3000 డాలర్ల ఆఫర్**

**ఈ ఏడాది చివరిలోగా స్వదేశానికి వెళ్లేవారికి వర్తింపు**

**ఉచిత విమాన ప్రయాణంతో పాటు జరిమానాల రద్దు**

**ఆఫర్ తీసుకోని వారిని అరెస్ట్ చేసి, శాశ్వతంగా నిషేధిస్తామని హెచ్చరిక**

**సీబీపీ హోమ్ యాప్ ద్వారా స్వచ్ఛందంగా పేర్లు నమోదు చేసుకోవాలని సూచన**



**న్యూయార్క్:** అమెరికాలో అక్రమంగా నివసిస్తున్న వలసదారులు స్వచ్ఛందంగా తమ స్వదేశాలకు తిరిగి వెళ్లేందుకు ట్రంప్ ప్రభుత్వం ఓ భారీ ప్రోత్సాహకాన్ని ప్రకటించింది. ఈ ఏడాది చివరిలోగా దేశం విడిచి వెళ్లేవారికి 3,000 డాలర్లు (సుమారు రూ. 2.7 లక్షలు) నగదుతో పాటు ఉచిత విమాన ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని డిసెంబర్ 22న హోంల్యాండ్ సెక్యూరిటీ విభాగం (డీహెచ్ఎస్) వెల్లడించింది. ఈ పథకంలో చేరేవారికి దేశం విడిచి వెళ్లనందుకు విధించిన సివిల్ జరిమానాలను కూడా రద్దు చేయనున్నట్లు డీహెచ్ఎస్ స్పష్టం చేసింది. ఇందుకోసం వలసదారులు 'సీబీపీ హోమ్' అనే మొబైల్ యాప్ ద్వారా తమ వివరాలు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. "ఈ పండుగ సీజన్‌లో అక్రమ వలసదారులు తమకు, తమ కుటుంబాలకు ఇచ్చుకోగల అత్యుత్తమ బహుమతి ఇదే. యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని, సమాచారం నింపితే చాలు, మిగతా ప్రయాణ ఏర్పాట్లన్నీ ప్రభుత్వమే చూసుకుంటుంది" అని డీహెచ్ఎస్ ఒక ప్రకటనలో పేర్కొంది.

అయితే, ఈ ఆఫర్‌ను వినియోగించుకోని వారిపై కఠిన చర్యలు తప్పవని ప్రభుత్వం హెచ్చరించింది. హోంల్యాండ్ సెక్యూరిటీ సెక్రటరీ క్రిస్టీ నోయెమ్ మాట్లాడుతూ.. "ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోకపోతే, మేము వారిని గుర్తించి, అరెస్ట్ చేసి, దేశం నుంచి బహిష్కరిస్తాం. వారు మళ్లీ అమెరికాలోకి ఎప్పటికీ అడుగుపెట్టలేరు" అని తేల్చిచెప్పారు.

ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకు సుమారు 1.9 మిలియన్ల మంది అక్రమ వలసదారులు స్వచ్ఛందంగా దేశం విడిచి వెళ్లారని, వేలాది మంది సీబీపీ హోమ్ యాప్‌ను ఉపయోగించారని క్రిస్టీ నోయెమ్ తెలిపారు. గతంలో మే నెలలో 1,000 డాలర్లుగా ఉన్న ప్రోత్సాహకాన్ని ఇప్పుడు క్రిస్మస్ సందర్భంగా మూడు రెట్లు పెంచినట్లు ఆమె పేర్కొన్నారు.

# విశాఖలో షఫాలీ సునామీ..

**రెండో టీ20లోనూ చిత్తైన శ్రీలంక..!**




**విశాఖపట్నం:** వన్డే ప్రపంచకప్ ఫైనల్లో మెరుపు అర్ధ శతకంతో టీమిండియా విజయంలో కీలకమైన షఫాలీ వర్మ(69 నాటౌట్) టీ20 సిరీస్‌లోనూ దంచేసింది. వైజాగ్ మైదానంలో మంగళవారం శ్రీలంక బౌలర్లను బెంబేలెత్తిస్తూ హాఫ్ సెంచరీతో చెలరేగింది. తనదైన స్టయిల్లో విధ్వంసం సృష్టించిన లేడీ సెహ్వాగ్ జట్టుకు భారీ విజయాన్ని అందించింది. స్వల్ప ఛేదనలో షఫాలీ మెరుపులతో ఏడు వికెట్ల తేడాతో లంకను టీమిండియా మట్టికరిపించింది. వరుసగా రెండో విజయంతో ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భారత్ 2-0తో ఆధిక్యంలోకి వెళ్లింది.

వైజాగ్‌లో భారత జట్టు ఆల్‌రౌండ్ షోతో శ్రీలంకను వణికించింది. స్పిన్నర్లు తిప్పేసి ప్రత్యర్థిని 128కే కట్టడి చేయగా.. చిన్నపాటి లక్ష్యాన్ని షఫాలీ వర్మ (69 నాటౌట్) తన విధ్వంసక ఆటతో కరిగించేసింది. స్మృతి మంధాన(14) ఔటయ్యాక గేర్ మార్చిన తను.. బౌండరీలతో స్టేడియాన్ని హోరెత్తించింది. ఆటపట్టు వేసిన ఆరో ఓవర్లో 4, 6, 4 బాది వైజాగ్ ప్రేక్షకులను అలరించింది. జెమీమా రోడ్రిగ్స్(26), కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్(10)తో కలిసి స్కోర్‌బోర్డును ఉరికించింది ఈ లెఫ్ట్ హ్యాండర్.

కావ్య వేసిన పదో ఓవర్లో బౌండరీతో అర్ధ శతకం పూర్తి చేసుకుంది షఫాలీ. ఆ తర్వాత అదే ఊపులో గిమ్హాని ఓవర్లో రెండు ఫోర్లు బాదింది హిట్టర్. విజయానికి ఒక్క పరుగు అవసరమైన వేళ మదర ఓవర్లో లెగ్‌సైడ్ షాట్ ఆడబోయిన హర్మన్ బౌల్డయ్యింది. ఆ తర్వాతి బంతికే రీచా ఘోష్(1 నాటౌట్) సింగిల్ తీయగా 7 వికెట్ల తేడాతో టీమిండియా గెలుపొందింది.



**తిప్పేసిన చరణి, వైష్ణవి**

టాస్ ఓడిన శ్రీలంక బ్యాటర్లను కట్టడి చేస్తూ.. వికెట్ల వేట కొనసాగించారు. శ్రీ చరణి(2-23), వైష్ణవి శర్మ(2-32) రెండు వికెట్లతో మెరవగా.. లంక స్కోర్ 120 మించలేదు. టీమిండియా స్పిన్నర్ల ధాటికి మిడిలార్డర్ కుప్పకూలగా సమరవిక్రమ(33), ఓపెనర్ చమరి ఆటపట్టు(31) రాణించారు. దాంతో.. పోరాడగలిగే స్కోర్ చేసేలా కనిపించిన లంకను వైష్ణవి, శ్రీచరణి నిలువరించారు. ఫీల్డింగ్ కూడా బాగా మెరుగుపడడంతో నిర్ణీత ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి పర్యాటక జట్టు 128 పరుగులే చేసింది.

# కోహ్లీ ఫ్యాన్స్‌కు నిరాశే..

**చిన్నస్వామి స్టేడియంలో నో క్రికెట్**

**బెంగుళూరు:** విజయ్ హజారే ట్రోఫీకి చెందిన క్రికెట్ మ్యాచ్‌లను బెంగుళూరులోని ఎం చిన్నస్వామి స్టేడియంలో నిర్వహించాల్సి ఉంది. కానీ రేపటి నుంచి జరగాల్సిన మ్యాచ్ వేదికను అకస్మాత్తుగా మార్చేశారు. చిన్నస్వామి స్టేడియంలో క్రికెట్ మ్యాచ్ నిర్వహించేందుకు కర్నాటక రాష్ట్ర క్రికెట్ సంఘానికి స్థానిక ప్రభుత్వం అనుమతి ఇవ్వలేదు. సిటీ పోలీసు కమీషనర్ సీమంత్ కుమార్ సింగ్ ఇవాళ ఆ విషయాన్ని ప్రకటించారు. జూన్‌లో ఆర్సీబీ విక్టరీ పరేడ్ నేపథ్యంలో జరిగిన తొక్కిసలాటలో 11 మంది మృతిచెందారని, ఆ ఘటన తర్వాత జస్టిస్ మైఖేల్ డీ కున్హా కొన్ని ప్రతిపాదనలు చేశారని, పోలీసులు కూడా 17 రకాల మార్పులు కోరుతూ ప్రతిపాదన చేశారని, కానీ ఒక్కటి కూడా కర్నాటక క్రికెట్ సంఘం అమలు చేయలేదని, అందుకే మ్యాచ్ నిర్వహణకు పర్మిషన్ ఇవ్వడం లేదని కుమార్ సింగ్ తెలిపారు.

చిన్నస్వామి స్టేడియంకు బదులుగా బీసీసీఐకి చెందిన క్రికెట్ ఆఫ్ ఎక్సలెన్సీ గ్రౌండ్‌లో మ్యాచ్‌లను నిర్వహించనున్నారు. భద్రతా కారణాల దృష్ట్యా, కర్నాటక ప్రభుత్వ ఆదేశాల ప్రకారం విజయ్ హజారే మ్యాచ్ వేదికను మార్చేశారు. ఢిల్లీ, ఆంధ్ర మధ్య మ్యాచ్ జరగాల్సి ఉన్నది. వాస్తవానికి ఈ మ్యాచ్‌లో ఆడేందుకు విరాట్ కోహ్లీ సిద్దంగా ఉన్నారు. కానీ ఆయన




అభిమానులకు నిరాశే మిగలనున్నది. చిన్నస్వామి స్టేడియంకు అనుమతి ఇవ్వకపోవడంతో.. సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ గ్రౌండ్‌లో ప్రేక్షకులు లేకుండానే మ్యాచ్‌ను నిర్వహించనున్నారు. వేదిక మార్పు గురించి రెండు జట్లకు తెలియజేసినట్లు కూడా వార్తలు వస్తున్నాయి. ఢిల్లీ జట్టులో రిషబ్ పంత్ కూడా ఉన్నాడు.

# నెంబర్ వన్ టీ20 బౌలర్‌గా దీప్తి శర్మ

**ముంబై:** భారత మహిళా క్రికెటర్ దీప్తి శర్మ టీ20ల్లో అత్యుత్తమ బౌలర్‌గా నిలిచారు. ర్యాంకింగ్స్‌లో ఆమె ప్రథమ స్థానాన్ని నిలబెట్టుకున్నది. ఆ ఆల్‌రౌండర్ తొలిసారి తన కెరీర్‌లో ఫస్ట్ ర్యాంక్ కొట్టేసింది. శ్రీలంకతో జరిగిన తొలి టీ20 మ్యాచ్‌లో దీప్తి శర్మ దుమ్ము రేపింది. ఈ నేపథ్యంలో ఆమె ర్యాంక్ మరింత మెరుగైంది. ఇక వన్డే బ్యాటర్లలో స్మృతి మంధానా తన నెంబర్ వన్ బ్యాటింగ్ పొజీషన్‌ను చేజార్చుకున్నది. దక్షిణాఫ్రికా కెప్టెన్ లౌరా వోల్వార్డ్ తొలి స్థానాన్ని కైవసం చేసుకున్నది. ఐర్లాండ్‌తో వన్డే సిరీస్ సమయంలో దక్షిణాఫ్రికా కెప్టెన్ అత్యుత్తమ ప్రదర్శన ఇచ్చింది.

ఆస్ట్రేలియాకు చెందిన అన్నాబెల్ సుదరల్యాండ్.. టీ20 బౌలర్ల జాబితాలో ఆగస్టు నుంచి నెంబర్ వన్ స్థానంలో ఉన్నది. అయితే తాజాగా శ్రీలంకతో జరిగిన మ్యాచ్‌లో ఓ వికెట్ తీసిన దీప్తి శర్మ తన ర్యాంక్‌ను మెరుగుపరుచుకున్నది. దీంతో ఆమె టాప్ ర్యాంక్ కొట్టేసింది. 8 వికెట్ల తేడాతో ఇండియా ఆ మ్యాచ్‌లో గెలవగా, దీప్తి శర్మకు అయిదు కీలకమైన పాయింట్లు వచ్చేశాయి. దీంతో ఆ స్టార్ ఆల్‌రౌండర్ ఒక పాయింట్ తేడాతో ఆస్ట్రేలియా బౌలర్ కన్నా ముందు నిలుచుంది.

టీ20 బ్యాటర్లలో జెమీమా రోడ్రిగ్స్ టాప్ టెన్‌లోకి చేరుకున్నది. ఆమె ప్రస్తుతం 9వ స్థానంలో నిలుచున్నది. లంకతో మ్యాచ్‌లో హాఫ్ సెంచరీ కొట్టి ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు అందుకున్న ఆమె టాప్ 10లోకి ప్రవేశించింది. టాప్ టెన్‌లో మంధానా, షఫాలీ శర్మ కూడా ఉ




న్నారు. వన్డే బ్యాటర్ల జాబితాలో మంధానా రెండో స్థానంలో ఉన్నది.

# క్రికెట్ దిగ్గజానికి 'ఆన్‌లైన్ భద్రత'..

**భారత తొలి క్రీడాకారుడిగా గవాస్కర్..!**

**న్యూఢిల్లీ:** భారత క్రికెట్ దిగ్గజం సునీల్ గవాస్కర్ పోరాటం ఫలించింది. ఆన్‌లైన్‌లో కొందరు తన పేరును, ఫొటోలను దుర్వినియోగం చేస్తున్నారని హైకోర్టును ఆశ్రయించిన లెజెండరీ ఆటగాడికి రక్షణ లభించింది. గవాస్కర్ ప్రతిష్టకు భంగం కలిగించేలా పెట్టిన పోస్టులను వెంటనే తొలగించాలని ఢిల్లీ హైకోర్టు తీర్పునిచ్చింది. ఇకపై ఈ మాజీ క్రికెటర్ పేరును, ఫొటోలను, వీడియోలను వ్యక్తిగత ప్రయోజనాలకు ఉపయోగించడాన్ని సహించబోమని కోర్టు స్పష్టం చేసింది. దాంతో.. కోర్టు నుంచి ఆన్‌లైన్ భద్రత పొందిన మొట్టమొదటి భారత క్రీడాకారుడిగా గవాస్కర్ గుర్తింపు సాధించాడు.

నిత్యం క్రీడా విశ్లేషణలతో వార్తల్లో నిలిచే గవాస్కర్ ఈమధ్య టీమిండియా వైఫల్యానికి హెడ్‌కోచ్ గౌతం గంభీర్‌ను నిందిస్తూ తీవ్ర విమర్శలు చేశాడు. అలానే కొందరు ఆటగాళ్ల ప్రదర్శనను ఎండగట్టాడు కూడా. అయితే.. గౌతీపై, కొందరు ఆటగాళ్లపై అతడు చేయని కొన్ని కామెంట్లను అతడికి ఆపాదిస్తూ కొందరు ఎక్స్, మెటా, గూగుల్‌లో పోస్ట్‌లు పెట్టారు.

దాంతో.. తన ఫొటోలను, వీడియోలను దుర్వినియోగం చేయడాన్ని సీరియస్‌గా తీసుకున్న ఆయన ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించాడు. ఆయన ఫిర్యాదును విచారించిన జస్టిస్ హన్మీత్ ప్రీతమ్ సింగ్ ఆరోరా బెంచ్ సదరు యూఆర్ఎల్స్ వివరాలను రెండు రోజుల్లో కోర్టుకు సమర్పించాలని సూచించింది. బెంచ్ ఆదేశాల మేరకు గవాస్కర్ తన పేరును దుర్వినియోగం చేస్తున్న యూఆర్ఎల్స్ వివరాలను తెలియజేశాడు.



మంగళవారం గవాస్కర్ తరపున సీనియర్ న్యాయవాది గోపాల్ జైన్ వాదనలు వినిపించారు. ఆయన సమర్పించిన యూఆర్ఎల్స్‌ను పరిశీలించిన ధర్మాసనం.. సోషల్ మీడియా, ఈ కామర్స్ సంస్థల వెబ్‌సైట్ల నుంచి సదరు పోస్ట్‌లను 72 గంటల్లోగా తొలగించాలని ఆదేశాలు జారీ చేసింది. ఒకవేళ ఏ సంస్థ అయినా గవాస్కర్ ఫొటోలు, వీడియోలను ఉ

# 'మెగా 158'పై పెరుగుతున్న హైప్



**టాకీస్:** మెగాస్టార్ చిరంజీవి వరుస సినిమాలతో అభిమానులను అలరించేందుకు సిద్ధమవుతున్నారు. సంక్రాంతికి 'మన శంకర వరప్రసాద్ గారు' సినిమా విడుదలకు రెడీ అవుతుండగా, వెంటనే దర్శకుడు బాబీ కొల్లి దర్శకత్వంలో మరో భారీ ప్రాజెక్ట్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ప్రస్తుతం ఈ సినిమాను 158 అనే వర్కింగ్ టైటిల్స్‌తో పిలుస్తుండగా, 'వాల్తేరు వీరయ్య' వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత చిరు-బాబీ కాంబోలో వస్తున్న సినిమా కావడంతో ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించి తాజాగా సోషల్ మీడియాలో ఓ క్రేజీ న్యూస్ వైరల్ అవుతోంది.

అదేంటంటే ఈ సినిమాలో మెగాస్టార్‌తో పాటు మరో స్టార్ హీరో కీలక పాత్రలో కనిపించబోతున్నారనే టాక్. ఇప్పటికే తమిళ స్టార్ హీరో కార్తీ పేరు వినిపించగా, ఆ తర్వాత మలయాళ సూపర్ స్టార్ మోహన్‌లాల్ కూడా ఈ సినిమాలో భాగం అవుతారనే వార్తలు ఊపందుకున్నాయి. లేటెస్ట్ సమాచారం ప్రకారం, మోహన్‌లాల్ ఈ ప్రత్యేక పాత్రకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. ఇది నిజమైతే చిరంజీవి-మోహన్‌లాల్ లాంటి ఇద్దరు దిగ్గజ నటులను ఒకే ఫ్రేమ్‌లో చూడటం అభిమానులకు నిజంగా పండుగే అవుతుంది. ఇక కథ విషయానికి వస్తే 'మెగా 158' లో చిరంజీవి తండ్రి పాత్రలో కనిపించబోతున్నారని టాక్. ఆయన కూతురిగా ఓ యంగ్ అప్‌కమింగ్ హీరోయిన్‌ను ఎంపిక చేసే అవకాశం ఉందని ఇండస్ట్రీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఆ హీరోయిన్ ఎవరన్నదానిపై ప్రస్తుతం ఆసక్తి నెలకొంది. అలాగే బాలీవుడ్ డైరెక్టర్ కమ్ యాక్టర్ అనురాగ్ కశ్యప్ కూడా ఈ చిత్రంలో కీలక పాత్రలో నటిస్తున్నట్లు గత కొంతకాలంగా వార్తలు వినిపిస్తున్నాయి. స్టార్ కాస్టింగ్‌తో పాటు టాప్ టెక్నీషియన్స్ కూడా ఈ ప్రాజెక్ట్‌లో భాగమవుతున్నారని సమాచారం. బాబీ ఈసారి తన రెగ్యులర్ టీమ్‌కు భిన్నంగా కొత్త టాలెంట్‌ను రంగంలోకి దించుతున్నారని తెలుస్తోంది. మాలీవుడ్ టాప్ సినిమాటోగ్రాఫర్ నిమిష్ రవి ఈ సినిమాకు డీఓపీగా వ్యవహరించనున్నారు.




MOVIE TIME

## గూస్ బంప్స్ తెప్పిస్తున్న
# 'ది ఒడిస్సీ' ట్రైలర్!

**టాకీస్:** 'ఓపెన్‌హైమర్'తో ఆస్కార్‌ను కొల్లగొట్టిన గ్లోబల్ లెజెండరీ డైరెక్టర్ క్రిస్టోఫర్ నోలన్ తన తదుపరి విజువల్ వండర్ 'ది ఒడిస్సీ'తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. గ్రీకు పురాణాల ఆధారంగా తెరకెక్కుతున్న ఈ చిత్రం వచ్చే ఏడాది జూన్ 17న ప్రేక్షకుల ముందుకు రాబోతుండగా.. తాజాగా ట్రైలర్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్. ఈ ట్రైలర్ చూస్తుంటే.. హెూమర్ రాసిన పురాతన గ్రీకు మహాకావ్యం 'ది ఒడిస్సీ' ఆధారంగా ఈ సినిమా రూపొందుతోంది. ట్రోజన్ యుద్ధం ముగిసిన తర్వాత 'ఒడిస్సియస్' తన స్వస్థలమైన ఇథాకాకు చేరుకోవడానికి పదేళ్లపాటు సముద్రంలో ఎదుర్కొన్న సాహసోపేతమైన ప్రయాణం, గ్రీకు దేవతలు, రాక్షసులతో చేసిన పోరాటాన్ని నోలన్ తన స్టైల్‌లో చూపించబోతున్నారు. ఇందులో ఒడిస్సియస్‌గా మ్యాట్ డామన్ నటిస్తుండగా, ఇతర ప్రధాన పాత్రల్లో టామ్ హాలండ్ (కుమారుడు టెలిమాకస్‌గా), యాన్ హాత్వే (భార్య పెనెలోప్ గా) కనిపిస్తున్నారు. ఇంకా జెండయా, రాబర్ట్ ప్యాటిన్సన్ వంటి స్టార్లు ఈ ప్రాజెక్ట్‌లో భాగమయ్యారు. ఈ సినిమాను పూర్తిగా సరికొత్త టెక్నాలజీతో చిత్రీకరించినట్లు తెలుస్తుంది.

## శివాజీ వ్యాఖ్యలపై రచ్చ

### దులిపేసిన సింగర్ చిన్మయి

### మా బాడీ..మా ఇష్టం అన్న అనసూయ

### శివాజీ తరపున నేను క్షమాపణలు చెబుతున్నా: మనోజ్

టాకీస్: నటుడు శివాజీ వ్యాఖ్యలపై సింగర్ చిన్మయి సోషల్ మీడియా వేదికగా ఘాటుగా స్పందించారు. హీరోయిన్లు చీరలు కట్టుకోవాలని, లేదంటే వారి 'సామాన్లు' కనిపిస్తాయని శివాజీ అనడాన్ని చిన్మయి తప్పుబట్టింది. ముఖ్యంగా 'దరిద్రపు ము?' వంటి బూతు పదాలను ప్రొఫెషనల్ వేదికలపై వాడటం ఏంటని శివాజీని ప్రశ్నించింది.





సామాన్లు వంటి పదాలను కేవలం 'ఇన్సెల్స్' (స్త్రీ ద్వేషులు) మాత్రమే వాడుతుంటారని ఆమె విమర్శించింది. అంతేగాకుండా హీరోయిన్లు భారతీయ సంప్రదాయం పాటించాలని చెప్పిన శివాజీ.. తాను మాత్రం జీన్స్, హూడీలు ధరిస్తారు. సంప్రదాయం గురించి అంతగా మాట్లాడేటప్పుడు ఆయన కేవలం ధోతీలు మాత్రమే కట్టుకోవాలి కదా? నుదుట బొట్టు పెట్టుకోవాలి, వివాహం అయినట్లు గుర్తుగా కంకణాలు, మెట్టెలు ధరించాలి కదా? అంటూ చిన్మయి ప్రశ్నించింది. ఒక సినిమాలో విలన్‌గా నటించిన శివాజీ.. బయట ఇలాంటి వ్యాఖ్యలు చేయడం ద్వారా స్త్రీలను ద్వేషించే వ్యక్తులకు హీరోగా మారుతున్నారని ఆమె ఎద్దేవా చేసింది. ఒక బహిరంగ వేదికపై మహిళల పట్ల ఇలాంటి ప్రవర్తన ఉండటం నమ్మశక్యంగా లేదని, అసలు మహిళలను ఇక్కడ ఎలా చూస్తున్నారో అర్థమవుతోందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. చిన్మయి చేసిన ఈ వ్యాఖ్యలు ఇప్పుడు నెట్టింట చర్చకు దారితీశాయి.

# నా కర్లీ హెయిర్ ఆఫర్లు రాకుండా చేసింది.. తాప్సీ



టాకీస్: హీరోయిన్ తాప్సీ అంటే కర్లీ హెయిర్ గుర్తొస్తుంటుంది. అదే ఆమెకు అందం అనిపిస్తుంది. కానీ ఈ కర్లీ హెయిర్ కారణంగా చాలా ఆఫర్లు కోల్పోయినట్లు తాజా ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చింది బ్యూటీ. ఆడిషన్స్‌లో నిర్మాతలు నా హెయిర్ చూసి హెజిటేట్ అయ్యేవారని.. ట్రెడిషనల్ హీరోయిన్లకు ఉండాల్సిన లుక్ తనకు లేదని మొహం మీదనే చెప్పేవారని తెలిపింది. ఈ విషయం తనను చాలా డిజప్పాయింట్ చేసిందని.. ఈవెన్ ఆఫర్లు వచ్చాక కూడా హెయిర్ స్ట్రెయిట్ చేయాలని మేకర్స్ నుంచి ప్రెజర్ ఉండేదని చెప్పింది. అయితే డైరెక్టర్ త్రివిక్రమ్ తన హెయిర్‌ను లైక్ చేశాడని... విజయ్ దేవరకొండ కూడా కర్లీ హెయిర్ అలాగే ఉంచాలని ఎంకరేజ్ చేశాడని తెలిపింది బ్యూటీ. ఇక ఇప్పుడు బాలీవుడ్‌లో చాలా మంది తన నేచురల్ హెయిర్‌ను అప్రిషియేట్ చేస్తున్నారని చెప్పింది. ఇక సౌత్‌తోపాటు హిందీ ఇండస్ట్రీలో సత్తా చాటిన తాప్సీ.. ప్రస్తుతం పెళ్లి చేసుకుని సెటిల్ అయిపోయింది. ప్రజెంట్ సెలెక్టివ్‌గా ప్రాజెక్ట్స్ ఎంచుకుంటూ ముందుకు సాగుతుంది.

## రవిబాబు మరో ఆసక్తికర సినిమా

టాకీస్: క్రియేటివ్ డైరెక్టర్ రవిబాబు మరోసారి ప్రేక్షకుల్లో క్యూరియాసిటీ పెంచే ప్రకటన చేశారు. ఇటీవల ఆయన దర్శకత్వంలో తెరకెక్కిన 'ఏనుగు తొండం ఘటికాచలం' సినిమా థియేటర్లకు కాకుండా నేరుగా ఈటీవీ విన్ ఓటీటీలో విడుదలైన విషయం తెలిసిందే. ఆ సినిమా తర్వాత ఇప్పుడు రవిబాబు తన కొత్త ప్రాజెక్ట్‌ను అధికారికంగా అనౌన్స్ చేస్తూ





ఆసక్తికరమైన అప్డేట్ ఇచ్చారు. తాజాగా ఈ కొత్త సినిమాకు సంబంధించిన కాన్సెప్ట్ పోస్టర్‌ను చిత్ర బృందం విడుదల చేసింది. ఆ పోస్టర్ చూడగానే ఇది సాధారణ సినిమాకాదు, పూర్తిగా భిన్నమైన కథతో రూపొందుతున్న సినిమా అనే ఫీలింగ్ కలుగుతోంది. వింతగా, మిస్టీరియస్‌గా ఉన్న పోస్టర్ సినిమా క్రైమ్ థ్రిల్లర్ జానర్‌లో ఉండబోతుందని స్పష్టమైన సంకేతాలు ఇస్తోంది. రవిబాబు స్టైల్‌కు తగ్గట్టుగా ఈ సినిమా కూడా కొత్త ఆలోచనలతో ప్రేక్షకులను ఆశ్చర్యపరచనుందనే అంచనాలు మొదలయ్యాయి. ఈ సినిమాకు సంబంధించిన పూర్తి వివరాలను బుధవారం ఉదయం 10:30 గంటలకు వెల్లడించనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. సినిమా టైటిల్‌తో పాటు నటీనటులు, సాంకేతిక బృందం వివరాలను ఒకేసారి బయటపెట్టనున్నారు. దీంతో రవిబాబు అభిమానులతో పాటు సినీ వర్గాల్లో కూడా ఈ అప్డేట్ కోసం ఆసక్తి నెలకొంది.ఈ ప్రాజెక్ట్‌ను ఫ్లయింగ్ ఫ్రాగ్స్ సంస్థ, సురేష్ ప్రొడక్షన్స్ కలిసి నిర్మిస్తున్నాయి.

### 'నారీ నారీ నడుమ మురారి'
# టీజర్ రిలీజ్




**టాకీస్:** టాలీవుడ్ చార్మింగ్ స్టార్ శర్వానంద్ హీరోగా, 'సామజవరగమన' ఫేమ్ రామ్ అబ్బరాజు దర్శకత్వంలో తెరకెక్కుతున్న హిలేరియస్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'నారీ నారీ నడుమ మురారి'. తాజాగా ఈ సినిమా టీజర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. టీజర్ ప్రారంభమే చాలా ఆసక్తికరంగా ఉంది. శర్వానంద్ హీరోయిన్ సాక్షి వైద్యను ప్రేమించి, పెళ్లికి సిద్ధమవుతాడు. అంతా సవ్యంగా సాగుతోంది అనుకున్న తరుణంలో.. అతని ఆఫీస్‌లోకి కొత్త టీమ్ లీడర్‌గా సంయుక్త మీనన్ ఎంట్రీ ఇస్తుంది. అయితే ఆమె మరెవరో కాదు, హీరోకి ఎక్స్ గర్ల్‌ఫ్రెండ్. అయితే తన పెళ్లి ఆగిపోకుండా ఉండటానికి హీరో పడే పాట్లు, ఇద్దరమ్మాయిల మధ్య చిక్కుకుని అతను పడే ఇబ్బందులు నవ్వులు పూయిస్తున్నాయి.

## ఏఐతో పెళ్లి వీడియో
## అభిమానులను ఆట పట్టించిన జగపతిబాబు



టాకీస్: టాలీవుడ్‌లో శోభన్ బాబు తర్వాత అంతటి ఫ్యామిలీ హీరో ఇమేజ్ సంపాదించుకున్న నటుడు జగపతి బాబు. వరుస సూపర్ హిట్ చిత్రాలతో మహిళా ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్న ఆయన, సెకండ్ ఇన్నింగ్స్‌లో విలన్, క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా ఊహించని స్థాయిలో సత్తా చాటుతున్నారు. అలాంటి సీనియర్ హీరో తాజాగా తన ఇంట్లో ఒక పెద్ద శుభకార్యం జరిగిందంటూ సోషల్ మీడియాలో చేసిన పోస్ట్ ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. తన రెండో కూతురి పెళ్లి జరిగిపోయిందంటూ జగపతి బాబు షేర్ చేసిన వీడియో నెట్టింట వేగంగా వైరల్ అయింది. సాధారణంగా సెలబ్రిటీల ఇంట్లో పెళ్లి అంటే భారీ ఏర్పాట్లు, ఆర్భాటం ఉంటాయి. కానీ జగపతి బాబు మాత్రం చాలా సింపుల్‌గా మా రెండో అమ్మాయి పెళ్లయి పోయిందోచ్ అంటూ వీడియోను షేర్ చేయడంతో అభిమానులు ఒక్కసారిగా షాక్ అయ్యారు. నిజంగానే పెళ్లి జరిగిందా? లేక సరదాగా చేసిన పోస్టా? అన్న సందేహాలు నెటిజన్లలో మొదలయ్యాయి.

## బెట్టింగ్ యాప్‌ల ప్రచార వ్యవహారం

### సీఐడీ విచారణకు హాజరైన మంచు లక్ష్మి



**టాకీస్:** నిషేధిత బెట్టింగ్ యాప్‌ల ప్రచార వ్యవహారానికి సంబంధించి సినీ నటి మంచు లక్ష్మి మంగళవారం హైదరాబాద్‌లోని సీఐడీ విచారణకు హాజరయ్యారు. లక్డీకపూల్‌లోని సీఐడీ కార్యాలయానికి చేరుకున్న ఆమెను ఈ యాప్‌లను ప్రమోట్ చేసినందుకుగానూ అందిన పారితోషికం మరియు కమీషన్ల లావాదేవీలపై అధికారులు సుదీర్ఘంగా ప్రశ్నిస్తున్నారు. గతంలోనే ఇదే కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కూడా ఆమెను విచారించగా, ఇప్పుడు సీఐడీ అధికారులు మరిన్ని వివరాలను సేకరిస్తున్నారు. కాగా, ఇదే వ్యవహారంలో గతంలో టాలీవుడ్ ప్రముఖ నటులు విజయ్ దేవరకొండ, రానా దగ్గుబాటి, ప్రకాశ్‌రాజ్ వంటి వారు కూడా విచారణకు హాజరైన సంగతి తెలిసిందే. సెలబ్రిటీల ప్రచారం కారణంగా సామాన్యులు ఈ బెట్టింగ్ యాప్‌ల బారిన పడుతున్నారనే ఆరోపణల నేపథ్యంలో దర్యాప్తు సంస్థలు ఈ కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.